

5,145 బందోబస్తుకు వినియోగించనున్న పోలీసు, తితిదే సెక్యూరిటీ. సైబర్‌క్రైమ్ పోలీసుల ద్వారా సోషల్‌మీడియాలో వ్యాపించే వదంతుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు.

2,700 అత్యాధునిక సీసీ కెమెరాలు, నిఘా నియంత్రణ కేంద్రాలతో నిరంతర పర్యవేక్షణ. ఈ సంవత్సరం నూతనంగా 'వీడియో ఎనలైజింగ్ టెక్నాలజీ' సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు.

24 తిరుమలలో పార్కింగ్ ప్రాంతాలు. తిరుపతిలో మరో ఐదు ఏర్పాటు. తిరుమలకు ఎనిమిది వేల వాహనాల వరకు అనుమతి. ఆపై ఆర్టీసీ బస్సుల్లోనే అనుమతి.

5 గరుడసేవ రోజు రద్దీ ఎక్కువైతే తిరుపతి నగర శివారులో ఏర్పాట్లు చేయనున్న హోల్డింగ్ పాయింట్లు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు భక్తుల రవాణా.

2 లక్షలు శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్యాలరీల్లో వాహన సేవలు వీక్షించనున్న భక్తులు. అదనంగా నాలుగు మాడ వీధుల్లోని మూలల వద్ద మరో 80 వేల మందికి అవకాశం.

బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

వెలుగుల రేడు.. ఆపద మొక్కులవాడు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి నవహ్నిక బ్రహ్మోత్సవాలకు సప్తగిరులు ముస్తాబయ్యాయి. పెరటాసి మాసం, సెలవుల నేపథ్యంలో లక్షల సంఖ్యలో భక్తులు స్వామివారి వాహన సేవలను దర్శించుకోనున్నారు. గరుడోత్సవం రోజున భారీగా శ్రీవారిని దర్శించుకోనున్నారన్న అంచనాతో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మాడవీధుల్లో గ్యాలరీల ఏర్పాటు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు సిద్ధం చేశారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం, పోలీసు శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేసింది. సామాన్య భక్తులకు ప్రాధాన్యమిచ్చేలా, వారు సులువుగా శ్రీవారి వాహన సేవల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గత బ్రహ్మోత్సవాల అనుభవాల నేపథ్యంలో పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

రాంభగీచా వద్ద కంట్రోల్ రూమ్



శోభాయమానంగా తిరుమల

తిరుమల క్షేత్రం బ్రహ్మోత్సవాల వేళ విద్యుత్తు వెలుగులతో ధగధగలాడుతోంది. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అలంకరణలు పూర్తిచేశారు. కల్యాణవేదికలో ఫల, పుష్ప ప్రదర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఈసారి ప్రత్యేకంగా సీతా స్వయంవరం, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏడుకొండలపై శ్రీనివాసుడు పవళించిన నమూనా సిద్ధం చేశారు. శ్రీవారి ఆలయం, దేవతా ప్రతిమలు మిరుమిట్లు గొలుపుతున్నాయి.



కొత్తగా తరలింపు బృందాలు

శ్రీవారి మాడవీధుల్లోకి ప్రవేశించే భక్తులకు నాలుగింటిలోనూ ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో తొక్కిసలాటలు నివారించేందుకు తితిదే ఆధ్వర్యంలో తరలింపు టీమ్‌లు ప్రత్యేకంగా ఈ సంవత్సరం నుంచి అందుబాటులోకి తేనున్నారు. గ్యాలరీల నుంచి బస్టాండ్ వరకు భక్తులను తరలించడం వీటి బాధ్యత. బందోబస్తుకు వచ్చిన పోలీసులు స్థానికుల దర్శన టికెట్లు పొందడం, బంధువులను గ్యాలరీల్లోకి అనుమతించడం చేస్తే కఠిన చర్యలు ఉంటాయి. వీవీఐపీలు, వీఐపీలు, ప్రెస్, ఉద్యోగులకు పాస్‌లు సిద్ధం చేశారు.

4న సీఎం పట్టువస్త్రాల సమర్పణ

శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణ సందర్భంగా శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం శ్రీవారిని దర్శించుకుంటారు. మాడవీధుల్లో పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు.

తనిఖీ చేశాకే అనుమతి: డీజీపీ

ఇన్నర్ రింగ్‌రోడ్డు నుంచి గ్యాలరీలోకి భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే క్యూలైన్లలో అనుమతిస్తామని డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. తితిదే విజిలెన్స్, పోలీసు శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గరుడసేవ రోజున వాహనాలను పైకి అనుమతించబోమని, క్యూఆర్‌కోడ్ సాయంతో కిందనే పార్కింగ్ చేసుకోవాలని, సురక్షిత ప్రయాణానికి భక్తులు ప్రజారవాణాను ఉపయోగించాలని కోరారు.

కాషాయ ధారణలో.. ప్రాయశ్చిత్త దారిలో..





తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తిరుమల, తిరుపతి పర్యటన నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్ వెంట రాగా పద్మావతి అతిథిగృహానికి చేరుకున్నారు. అనంతరం అలిపిరి వద్దకు చేరుకోగా జనసేన నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి తరలివచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన నేత హరిప్రసాద్, పార్టీ నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక భద్రత నడుమ ఆయన తిరుమలకు కాలినడకన చేరుకున్నారు.

ఆంజనేయ స్వామి జెండా చేతబూని అలిపిరి మెట్లు ఎక్కుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్





భక్తురాలికి నమస్కరిస్తూ.. • తితిదే పారిశుద్ధ్య కార్మికురాలిని పలకరిస్తూ..

వరుణుడిపైనే ఆశలన్నీ..!

రబీ రైతుల ఎదురుచూపు

రానున్న రబీ సీజన్ దృష్ట్యా రైతులందరూ సాగుకు నిరీక్షిస్తున్నారు. వరుణుడు కరుణిస్తే తప్ప పంటలు సాగు చేయలేని పరిస్థితి. అడపాదడపా వర్షాలు పడుతున్న చెరువుల్లోకి సాగు జలాలు చేరేంత పరిస్థితి కన్పించడం లేదు. సంవత్సరాంతం కాకుండా వీలైనంత ముందుగా వరుణుడు కరుణించాలని రైతులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

\- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరు చెరువులో అడుగంటిన నీటి నిల్వలు

సాగు విస్తీర్ణం ఘనమే

జిల్లా వ్యాప్తంగా బోర్లు, బావుల కంటే చెరువుల ఆధారిత వ్యవసాయం ఎక్కువ. రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 99,710 హెక్టార్లల్లో పంటలు సాగు చేస్తుంటారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు తదితర నియోజక వర్గాల పరిధిలో వరి సాగు ఎక్కువగా ఉంటుంది. ఖరీఫ్ పంట ఉత్పత్తులు చేతికందక పొలాలన్నీ బీళ్లుగా పెట్టుకున్నారు. అడపా దడపా పడుతున్న వర్షాల దృష్ట్యా కొందరు జనుము, జీలుగలు సాగు చేసుకుని పొలాన్ని మరింత సారవంతంగా తీర్చిదిద్దుకోవడంలో తలమునకలయ్యారు. వరుణుడు కరుణిస్తే సాగుకు సన్నాహాలు చేసుకునే దిశగా రైతాంగం నిరీక్షిస్తోంది.

చెరువులన్నీ ఖాళీ

సాధారణంగా సెప్టెంబరు ఆఖరు నుంచే వర్షాలు కురుస్తుంటాయి. అయితే ఈ దఫా రైతులు ఆశించిన మేరకు వర్షాలు కురవలేదు. ఇక అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో విస్తారంగా పడుతాయనే ఆశతో నిరీక్షిస్తున్నారు. వర్షాలకు చెరువులకు సమృద్ధిగా నీళ్లు వస్తుంటాయి. వర్షపాతాన్ని పరిశీలిస్తే.. జూన్, జులై నెలలో సాధారణ వర్ష పాతం కంటే కాస్తంత ఎక్కువగా నమోదైనా ఆగస్టులో 114 మిల్లీమీటర్లకు 101.9, సెప్టెంబరులో 124.2 మిల్లీ మీటర్లకు కేవలం 109.2 మాత్రమే నమోదైంది. దీంతో చెరువులన్నీ ఖాళీ అయ్యాయి. జిల్లాలో ఎం.ఐ. ట్యాంకులు 2461 కాగా తద్వారా సాగునీటి సామర్థ్యపు నిల్వలు 21,780 ఎంసీఎఫ్‌టీల మేరకు అందుబాటులో ఉండే అవకాశముంది. ప్రస్తుతం చెరువుల్లో నీటి నిల్వలన్నీ అడుగంటి పోయాయి. కనీసం పంట కాల్వలకు నీళ్లు అందలేని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో వరుణుడు కరుణిస్తే తప్ప పంటలు సాగు చేయలేని పరిస్థితి. దీంతో ఎప్పుడెప్పుడు వర్షాలు కురుస్తాయని రైతులందరూ వరుణుడి కరుణ కోసం నిరీక్షిస్తున్నారు.

సర్కారు నేల.. తవ్వకాలతో గుల్ల

చిల్లకూరు, న్యూస్‌టుడే: వల్లిపేడు చెరువులోంచి కొన్ని రోజులుగా కొందరు యథేచ్ఛగా మట్టి తవ్వి తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన సంబంధితశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలో సాగరమాల రహదారి నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. దీనికి తోడు లేఅవుట్లు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. వాటికి గ్రావెల్, మట్టి అవసరం కావడంతో ప్రభుత్వ భూములనే లక్ష్యంగా చేసుకుని ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. కలవకొండ రెవెన్యూ పరిధిలో సర్కారు నేలల్లో జరుగుతున్న తవ్వకాలను అడ్డుకునేందుకు యత్నించిన వీఆర్‌ఏపై గ్రావెల్ మాఫియా ఇటీవల దౌర్జన్యానికి దిగినట్లు సమాచారం. అధికారుల అండదండలతో అక్రమ తవ్వకాలకు తెగబడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు చొరవ చూపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



వల్లిపేడు చెరువులో యంత్రంతో తవ్వకాలు

భారతదేశ ఆత్మ పల్లెల్లో ఉందనేది మహాత్ముడి ప్రగాఢ విశ్వాసం. దేశ సామాజిక, రాజకీయ వ్యవస్థకు గ్రామాలు కేంద్ర బిందువులు కావాలని ఆయన ఆకాంక్షించారు. అవి స్వయంపాలన, ఆర్థిక పరిపుష్టి సాధించాలని కోరుకున్నారు. అటువంటి కీలకమైన పల్లెల అభివృద్ధిని ఐదేళ్లపాటు వైకాపా ప్రభుత్వం గాలికి వదిలేసింది. గ్రామీణ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. ప్రజా ప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి వేడుక చూసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. నేడు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పల్లెల పురోభివృద్ధికి కూటమి సర్కార్ వేస్తున్న అడుగులు ఇలా..

\- ఈనాడు, చిత్తూరు, ఈనాడు డిజిటల్, తిరుపతి

వైకాపా హయాంలో నిర్వీర్యమైన స్థానిక సంస్థలు

పురోభివృద్ధికి కూటమి సర్కార్ శరవేగంగా అడుగులు



పల్లె వెతలు బాపు

నేరుగా పంచాయతీల ఖాతాల్లోకే

వైకాపా హయాంలో 14, 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన నిధులు వచ్చినట్టే విద్యుత్తు బకాయిలకు జమ చేసుకున్నారు. తాగునీటి బోర్లను కూడా మరమ్మతు చేయలేకపోయారు. విషజ్వరాలు విజృంభిస్తున్నా బ్లీచింగ్ చల్లే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.29.23 కోట్లు రాగా అవన్నీ పంచాయతీల ఖాతాల్లోనే జమ చేశారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పంచాయతీలు: 1,474

వైకాపా హయాంలో విద్యుత్తు బకాయిలకు మళ్లించిన నిధులు: రూ.140 కోట్లు



ఎంఎస్ఎంఈలపై ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరైన ఔత్సాహికులు

పరిశ్రమలకు ఖిల్లాగా మార్చాలని

పల్లెల్లోని యువత ఉపాధి కోసం పట్టణాల బాట పట్టకూడదన్నది బాపూ ఆకాంక్ష. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది ఆధారపడ్డ పాడి, ఉద్యాన, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని భావిస్తోంది. రాష్ట్రంలో అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలతోపాటు చిత్తూరు జిల్లానూ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి చిన్న తరహా పరిశ్రమలకు ఖిల్లాగా మార్చేందుకు అడుగులు వేస్తోంది.



పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

జగన్ పాలనలో గ్రామాల్లో అపరిశుభ్రం రాజ్యమేలింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పరిస్థితిలో మార్పు వచ్చింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామాల్లోని చెత్తను సేకరించి దాన్ని ఆదాయ వనరుగా మార్చాలనే దిశగా అడుగులు వేస్తున్నారు.

2014-19 మధ్య ఉమ్మడి జిల్లాలో మంజూరైన గోకులాలు 10 వేలు

నిర్మాణం పూర్తయినవి 8 వేలు

పెండింగ్ బిల్లులు రూ.12 కోట్లు



కుప్పం మండలం చెక్కునత్తంలో గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

పాడి పరిశ్రమకు చేయూత

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే తేనెటీగల పెంపకం, పశుపోషణ, ఖాదీ తయారీ వంటివి ముఖ్యమని మహాత్ముడు భావించారు. 2014-19 మధ్య తెలుగుదేశం హయాంలో పశువులకు నీడను ఇచ్చేందుకు షెడ్ల నిర్మాణం చేపట్టేందుకు 'మినీ గోకులం' పథకాన్ని తీసుకువచ్చింది. ఉమ్మడి జిల్లాలో 10 వేల గోకులాలు మంజూరు చేయగా 8 వేలు నిర్మించారు. వీటికి సంబంధించి రూ.12 కోట్ల బిల్లులను వైకాపా ప్రభుత్వం విడుదల చేయలేదు. ఇటీవల పాలనా పగ్గాలు చేపట్టిన కూటమి సర్కార్ పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. షెడ్ల నిర్మాణానికి గొర్రెలు- మేకలు, కోళ్ల రైతులకు 70 శాతం రాయితీ, పాడి రైతులకు 90 శాతం రాయితీ ఇస్తోంది. కుప్పం నియోజకవర్గంలో ఇప్పటికే 593 మంజూరు చేయగా పనులు జరుగుతున్నాయి.

గ్రామసభలు నిర్వహించి.. పనులు పట్టాలెక్కించి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఒకేరోజు ఆగస్టు 23న 1,474 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించారు. వైకాపా హయాంలో ప్రజలందరి భాగస్వామ్యంతో పనులు గుర్తించిన దాఖలాలు ఐదేళ్లలో లేవు. ఇందుకు భిన్నంగా కూటమి సర్కార్ అడుగులు వేసింది. ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్లు, కుళాయి కనెక్షన్లు, వీధి దీపాలు, మరుగుదొడ్లు, పంట కుంటలు ఇలా ఏయే అభివృద్ధి కార్యక్రమాలు చేయాలో ప్రజల నుంచే అభిప్రాయాలు స్వీకరించారు. ప్రస్తుతం రూ.91.30 కోట్లతో గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి.

అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిస్తోన్న నిధులు రూ.185.30 కోట్లు



మొక్కలు నాటుతున్న చిన్నారులు

పింఛనుదారుల్లో ఆనందం



పింఛను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి (జీవకోన, భవానీనగర్), న్యూస్‌టుడే: ఒకటో తేదీనే ఇంటి వద్దే పింఛను అందజేస్తుండటంతో పింఛనుదారుల్లో ఆనందం కనిపిస్తోంది. తిరుపతి నగరంలోని అక్కారంపల్లె, సుబ్బారెడ్డినగర్‌లో మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య పాల్గొన్నారు. పింఛను అందజేసి లబ్ధిదారుల స్పందనను కలెక్టర్ తెలుసుకున్నారు. తెదేపా నాయకులు కాయం వెంకటరత్నం, నరేష్, రవిరెడ్డి, రుద్రకోటి సదాశివం, ఆముదాల తులసీరామ్, జనసేన నాయకుడు రాజారెడ్డి, కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

98.24% పూర్తి

ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను మంగళవారం సాయంత్రం 07.00 గంటల వరకు 98.24% పంపిణీ పూర్తిచేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు వెల్లడించారు. జిల్లాలో 2,66,342 మంది పింఛనర్లు ఉండగా 2,61,644 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు.

విధులకు హాజరుకాని సిబ్బంది

ప్రభుత్వ మద్యం దుకాణాల మూత

మందుబాబులకు తప్పని కష్టాలు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణ సిబ్బంది చేతులెత్తేశారు. ఉద్యోగ ఒప్పందం గడువు పూర్తికావడం.. ఇకపై తమకు ఉద్యోగాలు ఉండవనే నిరుత్సాహం.. ప్రైవేటు మద్యం దుకాణాలు వచ్చేవరకు మనమెందుకు ఉద్యోగం చేయాలనే ధోరణితో మంగళవారం వారు విధులకు గైర్హాజరయ్యారు. దీంతో జిల్లాలోని 240 ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడ్డాయి. ఉదయం 11 గంటలైనా తెరుచుకోకపోవడంతో అప్పటివరకు నిరీక్షించిన మందుబాబులు చివరకు బార్లకు వరుస కట్టారు. అక్కడి అధిక ధరలకు మద్యం కొనుగోలు చేసి తాగాల్సి వచ్చింది.

• రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మద్యం పాలసీని ఖరారు చేసింది. ఈనెల ఒకటి నుంచి పదో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి మరుసటి రోజు లాటరీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ చేపట్టనుంది. ఈ నెల 12 నుంచి ప్రైవేటు రిటైల్ దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. అప్పటివరకు ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందిని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఒప్పంద గడువు ముగియడంతో..

గతనెల 30 నాటికే ప్రభుత్వ మద్యం దుకాణ సిబ్బంది ఉద్యోగ ఒప్పందం గడువు ముగిసింది. ఐదేళ్లపాటు విధులు నిర్వహించిన సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఇదివరకు ప్రభుత్వ మద్యం దుకాణ సిబ్బంది వినతులు సమర్పించడం, ర్యాలీలు నిర్వహించడం చేసింది. వారి వినతులపై చర్చించేందుకు రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఈనెల 5న చర్చలకు పిలిచారు. అయితే ఈ పదిరోజులు పనిచేయించుకుని తమను వదిలేస్తారనే భావనతో జిల్లా వ్యాప్తంగా సిబ్బంది ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాల ఎక్సైజ్ ఉప కమిషనర్ టి.విజయశేఖర్, తిరుపతి సహాయ కమిషనర్ శ్రీనివాసాచారి.. ప్రభుత్వ మద్యం దుకాణ సిబ్బంది సంఘంతో చర్చలు జరిపారు. సాయంత్రానికి కొన్ని దుకాణాలు తెరుచుకున్నాయి. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న బార్లు సైతం మూతపడనుండగా కొత్త పాలసీ అమలయ్యే వరకు మందుబాబులకు కష్టాలు, అధిక భారం తప్పేలా లేదు.

సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా మంగళవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 18 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. సోమవారం శ్రీవారిని 66,986 మంది దర్శించుకున్నారు. రూ.5.05 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

బదిలీల్లో మార్పులు

ఈనాడు కథనానికి స్పందన

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని రెవెన్యూ శాఖలో కొద్ది రోజుల కిందట చేసిన బదిలీల్లో కొన్ని మార్పులు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'ఈనాడు'లో 'రెవెన్యూ శాఖలో బదిలీలలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టరేట్ అధికారులు గతంలో జరిగిన బదిలీల్లో కొన్ని మార్పులు చేస్తూ.. మరికొందరికి స్థానం చలనం కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు. సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయానికి ఇద్దరు ఆర్ఐలను నియమించారు. వాకాడు నుంచి బదిలీ చేసిన సెల్వరాజ్‌కు సీనియర్ సహాయకులుగా బాధ్యతలు అప్పగించారు. ఓజిలి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా నెల్లూరు జిల్లా రాపూరు నుంచి సతీష్‌కుమార్‌ను నియమించారు. తాజాగా ఆయన బదిలీని రద్దు చేశారు. ఆయన అక్కడే కొనసాగేలా ఉత్తర్వులు ఇచ్చారు.

227 మద్యం దుకాణాలకు టెండర్లు

మూడు పద్ధతుల్లో దరఖాస్తుల ఆహ్వానం


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: నూతన మద్యం విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. నూతన మద్యం పాలసీపై కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'జిల్లాలో 227 మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నారు. నగరపాలిక, మున్సిపాలిటీ, మండలాలు, నగర పంచాయతీల పరిధిలో జనాభా ప్రాతిపదికన నాలుగు శ్లాబ్‌ల కింద దుకాణాలకు అనుమతించారు. జిల్లాలో 10-50 వేలు, 50వేలు- 5లక్షలలోపు జనాభాగల శ్లాబ్‌లు మాత్రమే ఉన్నాయి. ఆ మేరకు రెండేళ్ల కాలపరిమితికి లైసెన్స్ ఫీజు నిర్ణయించారు. టెండరు దక్కించుకున్న వారు ఆరు విడతల్లో నిర్దేశిత ఫీజు చెల్లించవచ్చు. ఈనెల 1 నుంచి 9 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు తిరిగి చెల్లించరు. ఎవరు ఎక్కడ నుంచైనా ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. తిరుమల మినహా మిగిలిన 11 ఎక్సైజ్ స్టేషన్లలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు అందజేసి.. దరఖాస్తు రుసుం డీడీ రూపంలో చెల్లించవచ్చు. మూడో పద్ధతైన హైబ్రిడ్ విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని.. చలానా ద్వారా దరఖాస్తు రుసుం చెల్లించవచ్చు. టెండర్లలో పాల్గొనకుండా ఎవరినీ అడ్డుకోకూడదనే ఉద్దేశంతో మూడు విధాల్లో దరఖాస్తుల స్వీకారం జరుగుతోంది. ఈనెల 11న శిల్పారామంలో లక్కీడిప్ తీసి టెండర్లు ఖరారు చేస్తారు. అదేరోజు సాయంత్రంలోపు ఎంపికైనవారికి సమాచారం తెలియజేస్తారు. 12వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి వస్తాయ'ని కలెక్టర్ ప్రకటించారు.

ఆయా ప్రాంతాల్లోని దుకాణాలు	
తిరుపతి కార్పొరేషన్	32
శ్రీకాళహస్తి	12
పుత్తూరు	7
గూడూరు	12
నాయుడుపేట	13
సూళ్లూరుపేట	14
వెంకటగిరి	9
తిరుపతి రూరల్	12
రేణిగుంట	10
బీఎన్‌కండ్రిగ	5
కేవీబీపురం	3
తొట్టంబేడు	3
ఏర్పేడు	7
నాగలాపురం	4
పిచ్చాటూరు	3
సత్యవేడు	10
వరదయ్యపాలెం	5
నారాయణవనం	3
రామచంద్రాపురం	4
వడమాలపేట	4
చంద్రగిరి	7
పాకాల	5
చిన్నగొట్టిగల్లు	3
యర్రావారిపాలెం	2
చిల్లకూరు	6
ఓజిలి	2
దొరవారిసత్రం	2
పెళ్లకూరు	2
తడ	5
వాకాడు	4
చిట్టమూరు	4
కోట	7
బాలాయపల్లి	3
డక్కిలి	3

ఉద్ధృతంగా.. దాహార్తి తీర్చడం లక్ష్యంగా


తెలుగుగంగ కాల్వలో ప్రవాహం


కాల్వ వెంబడి వస్త్రాలు ఉతుకున్న మహిళ

శ్రీకాళహస్తి : తిరుమలేశుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం నేపథ్యంలో తిరుపతికి తాగునీటి ఎద్దడి దరిచేరకూడదన్న భావనతో కండలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. ప్రధానంగా చెన్నై ప్రజల దాహార్తితో పాటు వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు దూరం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలుగుగంగ అధికారులు నీటిని విడుదల చేశారు.

చెన్నైకు విడుదల

సత్యసాయి తెలుగుగంగ కాల్వ గుండా ప్రస్తుతం 700 క్యూసెక్కుల మేర నీటి ప్రవాహం సాగుతోంది. దీంతో కాల్వ గుండా ప్రవాహ ఉద్ధృతి ఉద్ధృతంగా ఉంది. చెన్నైతో పాటు ఇతర ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణ నిమిత్తం తెలుగు గంగను విడుదల చేశారు. కృష్ణ బేసిన్, శ్రీశైలం జలాశయం నుంచి నీటి నిల్వలు సోమశిలకు, అక్కడ నుంచి కండలేరుకు కొంత మేర విడుదల చేయడంతో ప్రస్తుతం 10 టీఎంసీల మేర నీటి నిల్వలున్నాయి. చెన్నైకు 400 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేయాలన్న సంకల్పంతో నీటిని విడుదల చేశారు.

ప్రమాదాన్ని విస్మరించద్దు

కాల్వలో ప్రవాహం ఉద్ధృతంగా సాగుతున్న నేపథ్యంలో ప్రమాదాన్ని విస్మరించవద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పంటల కోసం కాల్వలో సైఫన్లు వేయడం, దుస్తులు ఉతకడం, స్నానాలు చేయడం తదితరాలకు కాల్వ వెంబడికి వెళ్లద్దని సూచిస్తున్నారు. ప్రవాహం వేగంగా ఉండటంతో ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందన్నారు. లోతు, వేగం తెలియకుండా కాల్వలో దిగేందుకు ప్రయత్నిస్తే ఇబ్బందులు తప్పవంటున్నారు. ప్రస్తుతం తాగునీటి ఎద్దడి నివారణకు మాత్రం తెలుగు గంగను విడుదల చేశామని, సాగుకు వినియోగించవద్దని, చెరువులకు మళ్లింపు చేయద్దని తెలుగుగంగ ఈఈ సుబ్రహ్మణ్యం కోరారు.


ఆలయం ఎదుట డీజీపీ ద్వారకా తిరుమలరావు, చిత్రంలో తితిదే సీవీఎస్‌వో శ్రీధర్, ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తదితరులు

శ్రీవారిని దర్శించుకున్న డీజీపీ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. వీరితోపాటు తిరుపతి ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, తితిదే సీవీఎస్‌వో శ్రీధర్, ఏవీఎస్‌వోలు గిరిధర్, మనోహర్, డీఎస్పీ విజయ్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీజీపీ తిరుమలలోని బాలాజీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఆర్టీసీ డీఎంతో మాట్లాడి వెనుదిరిగారు. శ్రీవారిని ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ జనరల్ గుర్‌బీర్‌పాల్ సింగ్, అనంతపురం రేంజీ డీఐజీ డాక్టర్ షేముషి దర్శించుకున్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక


మాధురి

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: నెరబైలు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మాధురి, అండర్-17 విభాగంలో జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్ తెలిపారు. వినుకొండలో జరిగిన పోటీల్లో మాధురి ప్రతిభచూపి త్వరలో జమ్మూకశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. మాధురిని పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖరయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫొటో ఓటరు జాబితాల పరిశీలన పూర్తి: కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఇంటింటా ఫొటో ఓటరు జాబితాల పరిశీలన జిల్లా వ్యాప్తంగా 99.81% పూర్తయినట్లు కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బీఎల్వోలు జాబితాలను నిశితంగా పరిశీలించారని, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను నిబంధనల మేరకు చేపడుతున్నట్లు వెల్లడించారు. అంతకుముందు అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ నిర్వహించిన వీసీలో అధికారులు పాల్గొన్నారు.

◆జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళికలు సిద్ధం చేయాలని జేసీ శుభంభన్సల్ అన్నారు. స్వర్ణాంధ్ర-2047 అమలుపై ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, రైతు సంఘాల, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అన్ని రంగాల్లో నుంచి ప్రణాళికలు రూపొందించాలని, ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించవచ్చన్నారు.

పాకశాస్త్ర కళాశాలలో వేడుకలు


జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా స్థానిక పాకశాస్త్ర కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాత పరీక్షలను నిర్వహించారు. అనంతరం కళాశాలలో ఓనమ్ వేడుకలు జరిపారు. తిరుపతి ఐజేటీ, ఎన్వెర్ కేంద్రలకు చెందిన విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల హెడ్ త్రిలోకచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు	
బ్రాయిలర్ (రైతు ధర)	111
రిటైల్	133
లేయర్	115
బ్రాయిలర్స్	193
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	219
లేయర్ మాంసం	195

'వైకాపా హయాంలో తప్పులే తప్పులు'


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ డాక్టర్ చింతా మోహన్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తిరుమలలో వైకాపా హయాంలో తప్పుల మీద తప్పులు చేశారంటూ మాజీ ఎంపీ చింతా మోహన్ ధ్వజమెత్తారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రూ.500 ఉన్న టికెట్‌ను రూ.5 వేలకు అమ్ముకున్న ఘనత వైకాపాదేనన్నారు. నెయ్యి కల్తీ అన్నది వాస్తవమని, మార్కెట్‌లో కిలో రూ.700 ధర పలుకుతుంటే రూ.320 సరఫరా చేస్తుంటే.. దాన్నిబట్టే ఎంత నాణ్యతగా ఉందన్న విషయం స్పష్టమవుతుందన్నారు. జంతువుల కొవ్వు కలిపారన్నది అర్థరహితమన్నారు. గత ధర్మకర్తల మండలి హయాంలో ఇలాంటి తప్పిదాలు ఎన్నో జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూలో గతంలో మాదిరి ఘుమఘుమలు లేవని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. సూళ్లూరుపేట ర.భ.శాఖ అతిథి భవనం వద్ద ఆయన మాట్లాడారు. తితిదే కాటేజీలను పడగొట్టి వాటి స్థానంలో కొత్త వాటిని రూ.వంద కోట్లతో నిర్మించేందుకు కమీషన్లు పొందారని ఆరోపించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ నేత చందనమూడి శివ పాల్గొన్నారు.

పొన్నేరి భూముల పరిశీలన

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయానికి సంబంధించి తమిళనాడు రాష్ట్రంలోని పొన్నేరిలోని భూములను తిరుపతి ఆర్డీఓ, ముక్కంటి ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ సోమవారం పరిశీలించారు. దస్త్రాల ప్రకారం ముక్కంటి ఆలయానికి ఎంత మేరకు భూములున్నాయని తెలిపారు. ఇక్కడి స్థలాల విలువ భారీగా పెరగడంతో కోట్ల రూపాయల విలువ చేసే భూములు అన్యాక్రాంతానికి వీల్లేకుండా చూడాలంటూ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆలయ ఈఈ మురళీధర్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

ఎర్రచందనం గ్లోబల్ టెండర్లకు సన్నాహాలు


ఎర్రచందనం వివరాలు నమోదు చేస్తున్న పీసీసీఎఫ్ సుమన్

మంగళం (తిరుపతి): ఎర్రచందనం విక్రయాల్లో భాగంగా 20వ గ్లోబల్ టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. త్వరలో 900 టన్నులకు వేలం నిర్వహించే అవకాశం ఉంది. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ఆర్.కె.సుమన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ మంగళవారం తిరుపతిలోని కేంద్రీయ ఎర్రచందనం గోదాములను సందర్శించింది. 50 లాట్లలో నిల్వ చేసిన దుంగల గ్రేడ్లను పరిశీలించడంతోపాటు వాటి రంగును నమోదు చేశారు. గతంలో ఉన్న ధరలను సవరించిన అనంతరం గ్లోబల్ టెండర్లకు వెళ్లే అవకాశం ఉంది. గతంలో ఏ-గ్రేడు రూ.65-75 లక్షలు, బి-గ్రేడు రూ.30-35 లక్షలు, సి-గ్రేడు రూ.20 లక్షలు ఉంది. కమిటీలో తిరుపతి సీసీఎఫ్ నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, స్టేట్ సిల్వికల్చరిస్ట్ యశోదాబాయి, కేంద్రీయ ఎర్రచందనం గోదాముల డీఎఫ్‌వో ఎస్.ఎస్.శివకుమార్ ఉన్నారు.

దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు

తిరుపతి (రైల్వే), న్యూస్‌టుడే: దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు తిరుపతి స్టేషన్ మేనేజర్ చిన్నపురెడ్డి తెలిపారు. తిరుపతి- కాచిగూడ (07064) రైలు అక్టోబరు 2, 9, 16, 23, 30న, నవంబరు 6, 13న.. 07654 రైలు అక్టోబరు 11, 18, 25న నవంబరులో 1, 8, 15వ తేదీల్లో.. తిరుపతి- సికింద్రాబాద్ (07042) రైలు అక్టోబరులో 3, 5, 10, 12, 17, 19, 24, 26, 31న, నవంబరు 2, 7, 9, 14, 16న.. 07490 రైలు అక్టోబరు 8, 15, 22, 29న, నవంబరు 5, 12, 19, 26న.. 07481 రైలు అక్టోబరు 13, 20, 27న.. నవంబరు 3, 10, 17, 24న.. తిరుపతి- విశాఖపట్నం (08584) రైలు అక్టోబరు 8, 15, 22, 29న, నవంబరు 5, 12, 19, 26న.. తిరుపతి- షిరిడీ (07637), తిరుపతి- మచిలీపట్నం (07121) రైళ్లు అక్టోబరు 6, 13, 20, 27న నవంబరు 3, 10, 17, 24వ తేదీల్లో.. తిరుపతి- శ్రీకాకుళం (07442) రైలు అక్టోబరు 6, 13, 20, 27న, నవంబరు 3, 10న నడవనున్నాయి.

తితిదే సొంతంగా డెయిరీ ఏర్పాటు చేయాలి


పాదయాత్రగా తిరుమల చేరుకుంటున్న రామచంద్రయాదవ్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ప్రసాదాలు, లడ్డూలను తయారు చేసేందుకు అవసరమైన నెయ్యిని సొంతంగా తయారు చేసుకునేందుకు తితిదే సొంత డెయిరీని ఏర్పాటు చేయాలని బీసీవైఎం పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. పుంగనూరు నుంచి తిరుమల పరిరక్షణ పాదయాత్ర చేపట్టిన ఆయన నాలుగురోజుల అనంతరం మంగళవారం తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఎస్వీ గోశాల వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలలో రోజుకొక వివాదం చోటుచేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. తితిదే సొంతంగా డైరీని ఏర్పాటు చేస్తే తాను వెయ్యి ఆవులను విరాళంగా ఇస్తానని, దాతల సహకారంతో మరో లక్ష ఆవులను ఇప్పించే బాధ్యత తీసుకుంటానన్నారు. తద్వారా పెద్దఎత్తున పాలు, నెయ్యి తితిదేకు అందుబాటులోకి వస్తుందని, వెయ్యిమంది గోపాలురకు ఉపాధి లభిస్తుందన్నారు. చిత్తూరు డైరీని తితిదే పరిధిలోకి తీసుకురావాలని 2019లో తితిదే పాలకమండలి తీర్మానించగా చివరకు అమూల్‌కు కేటాయించారని ఆయన విమర్శించారు. సీఎం చంద్రబాబు హయాంలో ఈ కార్యక్రమాన్ని చేపడితే చరిత్రలో నిలచిపోతారని చెప్పారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు


సహస్ర రెడ్డి, సృజన

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్-15 మహిళా క్రికెట్ పోటీలు నందమూరి తారక రామారావు క్రీడా మైదానంలో హోరాహోరీగా సాగుతున్నాయి. గ్రౌండ్ 'ఎ'లో టాస్ గెలిచిన టీమ్ 'డి' జట్టు బ్యాటింగ్ చేపట్టి 6 వికెట్లు నష్టపోయి 208 పరుగులు సాధించింది. జట్టులో ధన్యశ్రీ 60 పరుగులు చేసింది. టీమ్ 'ఎ' తరఫున బౌలింగ్‌లో వర్ష, సాయివర్షిక రెండేసి వికెట్లు తీశారు. తరువాత బరిలో దిగిన టీమ్ 'ఎ' జట్టు 6 వికెట్లు నష్టానికి 209 పరుగులు సాధించింది. జట్టులో పుష్పిత 93 పరుగులు చేసింది. టీమ్ 'డి' జట్టు తరఫున బౌలింగ్ చేసిన మేఘన, నేహ రెండేసి వికెట్లు తీశారు. టీమ్ 'ఎ' జట్టు 4 వికెట్లు తేడాతో విజయం సాధించింది. గ్రౌండ్ 'బి'లో బ్యాటింగ్ చేపట్టిన టీమ్ 'సి' 133 పరుగులకే ఆలౌట్ అయ్యింది. జట్టులో దీక్షిక 68 పరుగులు చేసింది. టీమ్ 'బి' జట్టులో బౌలింగ్ చేపట్టిన బెహరా, సహస్ర మూడేసి వికెట్లు తీశారు. బరిలో దిగిన టీమ్ 'బి' జట్టు వికెట్ నష్టపోయి 137 పరుగులు చేసింది. సహస్రరెడ్డి 72, సృజన 51 పరుగులు చేశారు. టీమ్ 'బి' 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

స్వార్థం కోసమే నెయ్యి టెండర్లలో మార్పులు


భానుప్రకాష్ రెడ్డి

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో నేతల స్వార్థ ప్రయోజనాల కోసమే నెయ్యి టెండర్లకు సంబంధించిన నిబంధనలు మార్చివేశారని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నిబంధనల మార్పుకోసం తితిదే బోర్డు ఆదేశం 371 (29.02.2020)లో నెయ్యి సరఫరా చేసే డెయిరీ వార్షిక ఆదాయం రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు మార్చారని, ప్రతిరోజూ నాలుగు లక్షల లీటర్ల పాల సేకరణ ఉండాలనే నిబంధనలను పూర్తిగా రద్దు చేశారని, వైవీ.సుబ్బారెడ్డి బోర్డు ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఇదంతా జరిగిందన్నారు. ఇలాంటి అనేక మార్పులు చేసిన వాటిపై వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డిలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తితిదే పాలక మండలి ఆహ్వానం మేరకు రాష్ట్ర ప్రజల ప్రతినిధిగా ముఖ్యమంత్రి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సమయంలో ఎటువంటి డిక్లరేషన్ అవసరం లేదని, సాధారణ వ్యక్తిగా శ్రీవారిని దర్శించుకోవాలంటే డిక్లరేషన్ తప్పనిసరని ఉత్తర్వుల్లో పేర్కొందన్నారు. వరప్రసాద్, అజయ్ కుమార్, డా.శ్రీహరి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: వి.ఆర్.అగ్రహారం పంచాయతీలో విద్యుదాఘాతానికి గురై కార్మికుడు సుకులాల్ కుంకుల్(26) మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పలువురు కూలీలు మండలంలోని గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా పనులు చేస్తున్నారు. మంగళవారం స్తంభాలపై తీగలు లాగుతుండగా విద్యుత్తు సరఫరా కావడంతో సుకులాల్ కిందపడ్డారు. తీవ్రంగా గాయపడగా యర్రావారిపాలెం పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై విద్యుత్తుశాఖ ఏఈ జ్యోతిప్రసాద్‌ను వివరణ కోరగా ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని, విద్యుత్తు సరఫరా ఆపాలని తమను కోరలేదన్నారు.

కళాశాల బస్సు బోల్తా: నలుగురికి గాయాలు




చిల్లకూరు, న్యూస్‌టుడే: చింతవరం సమీపాన విద్యార్థులతో వెళ్తున్న బస్సు మంగళవారం అదుపుతప్పి బోల్తా కొట్టింది. పోలీసుల వివరాల మేరకు.. కోట మండలం విద్యానగర్‌లోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో చదువుతున్న సుమారు 35 మంది విద్యార్థులు నెల్లూరు జిల్లా ముత్తుకూరు, తదితర ప్రాంతాల నుంచి బస్సులో కళాశాలకు వెళ్తున్నారు. డ్రైవర్ చాంద్‌బాషా మద్యం మత్తులో వాహనాన్ని నడపడంతో ఇక్కడున్న మలుపు వద్ద అదుపు చేయలేక ప్రమాదం చోటుచేసుకుంది. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు ఝాన్సీ, కులదీప్, నాగమణితోపాటు అధ్యాపకుడు వెంకటసుబ్బయ్యకు గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. గాయపడ్డ వారిని ప్రథమ చికిత్స నిమిత్తం చింతవరంలోని పీహెచ్‌సీకి తరలించారు.

గ్రామీణాభివృద్ధితోనే దేశ ప్రగతి


కార్యక్రమంలో పాల్గొన్న ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ, విద్యార్థులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే దేశం సులభంగా ప్రగతి పథంలో పయనిస్తుందని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఏర్పేడు మండలం చిందేపల్లి పంచాయతీలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ విద్యార్థులతో కలసి గ్రామంలో పరిసరాలను శుభ్రం చేశారు. ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో పంటకాలువ పూడిపోవడంతో జేసీబీతో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఐఐటీ నోడల్ అధికారి చైతన్య, ఎన్ఎస్ఎస్ అధికారి మహేష్, జీవీ సుబ్బారెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

గరుడ సేవకు విచ్చేసే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు


అధికారులతో సమీక్షిస్తున్న తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 8న జరిగే గరుడసేవకు లక్షలాదిగా విచ్చేసే భక్తులకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. స్థానిక గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం ఆయన సమీక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల వీడియోలను పరిశీలించి సంబంధిత అధికారులకు ప్రత్యేకంగా సూచనలు చేశారు. గ్యాలరీల్లో అన్నప్రసాదం పంపిణీ విధానాలను పరిశీలించి ఇతర విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రవాణాశాఖ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి, హెచ్‌డీపీపీ, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

పక్షుల రక్షిత కేంద్రం ప్రారంభం

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని మంగళవారం స్థానిక ఎఫ్‌ఎస్‌వో బాలయ్య ప్రారంభించారు. నిర్ణీత రుసుం చెల్లించిన సందర్శకులను పక్షుల రక్షిత కేంద్రంలోకి అనుమతిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి నేలపట్టు చెరువులో తగినంత నీరు లేనందున 23 నత్తగుల్ల కొంగలు ఉన్నట్లు చెప్పారు.

తిరుపతి

●తిరుపతి ● చంద్రగిరి

ఎస్వీయూలో తాత్కాలిక సిబ్బంది తొలగింపు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూలో గత ప్రభుత్వంలో తాత్కాలిక ఉద్యోగులుగా నియమితులైన వారిలో 64 మంది వైదొలిగారు. గతనెల 14 మందిని విధుల నుంచి తొలగించిన విషయం విదితమే. 89 రోజుల పనిదినాలు పూర్తయ్యాక కొనసాగింపు లేకపోవడంతో వారు విధుల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అతిథి ఆచార్యులుగా గత వైకాపా ప్రభుత్వంలో రెండు విడతలుగా నియమితులైన 71 మందిని సైతం విధులకు హాజరుకావొద్దని ఆదేశించినట్లు సమాచారం. ఐదేళ్ల వైకాపా పాలనలో సిబ్బందిని నియమించే విషయంలో రూ.లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతిథి ఆచార్యులుగా నియమితులైన వారి నుంచి గతంలో కొందరు పెద్దలు ముడుపులు తీసుకొన్నట్లు సమాచారం. ఇప్పుడు వారంతా కన్నీటి పర్యంతమవుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే

సమస్య: యశోదనగర్ మూడోవీధిలో తెలుగు గంగ నీరు వారం రోజులుగా ఎరుపు రంగులో వస్తోంది. ఇది కళ్యాణి డ్యామ్ నుంచి వస్తున్నట్లు చెబుతున్నారు. సమస్యను పరిష్కరించాలి.
- గోపాల్, యశోదనగర్

సమాధానం: సంబంధిత ఇన్‌స్పెక్టరుకు ఆదేశించి సమస్యను పరిష్కరిస్తాం.
- టి.మోహన్, నగరపాలిక ఎస్ఈ

సమస్య: గాంధీరోడ్డులో మ్యాన్‌హోల్స్, భూగర్భ కేబుళ్ల కోసం తవ్విన గోతులు పూడ్చకుండా వదిలేశారు. చైతన్య కళాశాల ముందున్న గొయ్యి ప్రమాదకరంగా ఉంది. గుంతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. **- వేణు, తిరుపతి**

సమాధానం: గుంతలు పూడ్చే పనులు జరుగుతున్నాయి. గాంధీరోడ్డులో త్వరలో చేపడతాం.
- టి.మోహన్, నగరపాలిక ఎస్ఈ

శ్రీవారిని దర్శించుకున్న తెదేపా ఎంపీ కలిశెట్టి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఈవో జె.శ్యామలరావును కలిశారు. విజయనగరంలో నాలుగు ప్రదేశాల్లో తితిదే కల్యాణమండపాలు నిర్మించాలని, రణస్థలం మండలం, కొండములగాం గ్రామంలో నిర్మాణానికి సిద్ధమైన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి సహాయం చేయాలని కోరారు. విజయనగరం పార్లమెంట్ పరిధిలో శ్రీవారి కల్యాణాలు జరిపించాలని కోరారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు.

సమన్వయంతో భక్తులకు సేవలందించాలి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఏపీఎస్‌ఆర్టీసీ చేపట్టిన ఏర్పాట్లను సంస్థ ఎండీ, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు పరిశీలించారు. ఆయనకు జిల్లా ప్రజారవాణా అధికారి టి.చెంగల్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని డీజీపీ ఆదేశించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ 1930 ట్రిప్పులతో 1.70 లక్షల మంది భక్తులకు, గరుడసేవరోజు 2714 ట్రిప్పులతో 2.50 లక్షల మంది భక్తులకు ప్రయాణ సౌకర్యం కల్పించడంపై దిశానిర్దేశం చేశారు. చిత్తూరు ప్రజారవాణా అధికారి ఎం.జగదీష్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.భాస్కర్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరు జి.నరసింహులు, తిరుమల డిపో మేనేజరు విశ్వనాథ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. **తిరుచానూరు:** శ్రీపద్మావతి అమ్మవారిని డీజీపీ ద్వారకా తిరుమలరావు దర్శించుకున్నారు.

అఖండ జ్యోతితో అభిమాని రాక

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష విరమిస్తున్న నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన బచ్చు అవినాష్ దేవీచంద్ర తలపై అఖండ దీపంతో తిరుమలకు చేరుకున్నారు. 'సేవా భారత్ ట్రస్ట్' ఆధ్వర్యంలో అలిపిరి నుంచి నడక మార్గంలో అఖండ దీపం, చేతిలో కాగడాతో తిరుమలకు వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆయనకు స్వాగతం పలికారు. శ్రీవారి ఆశీస్సులు పవన్ కల్యాణ్‌కు ఆయన కుటుంబ సభ్యులకు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు.

విద్యార్థినులకు పోటీలు

మహిళా వర్సిటీ(తిరుపతి): యువతరం ఆలోచన స్వర్ణాంధ్ర సాధన కార్యక్రమంలో భాగంగా శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ స్టూడెంట్ అఫైర్స్, మహిళా అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించారు. హ్యుమానిటీస్ బ్లాకు సమావేశ మందిరంలో ఈ పోటీలు జరిగాయి. డీన్ కాత్యాయిని, తిరుపతి ఐఐటీ ఆడిటర్ శివశంకర్, కన్సల్టెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ.. విఘాతం

అలంకారప్రాయంగా సంపద సృష్టి కేంద్రాలు


బుచ్చినాయుడుపల్లె పంచాయతీలోని కేంద్రం

చంద్రగిరి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడమే కాకుండా చెత్త నుంచి సంపద తయారు చేయాలన్న లక్ష్యంతో నిర్మించిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వాటి ద్వారా పంచాయతీలకు ఆదాయం చేకూర్చాలనే ఆశయంతో గతంలో తెదేపా ప్రభుత్వం వాటిని నిర్మించింది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు వాటిని నిర్లక్ష్యం చేయడంతో ఆశయం నీరుగారింది. కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

రంగులతో సరి..

గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద ఉత్పత్తి కేంద్రాలకు తరలించి అక్కడ వర్మీకంపోస్టు తయారు చేసేలా ప్రణాళిక రూపొందించారు. అలా తయారు చేసిన ఎరువును రైతులకు సరళమైన ధరకు అందించడమే కాకుండా ఆ నగదును పంచాయతీకి జమచేసి ఆదాయం వచ్చేలా నిర్ణయించారు. వైకాపా ప్రభుత్వం వాటికి పార్టీ రంగులు వేయడంతో సరిపెట్టింది.

కూటమి ప్రభుత్వం దృష్టి

నియోజకవర్గ వ్యాప్తంగా 90 శాతం కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఆరు మండలాల్లోని 117 పంచాయతీలకు 106 గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.60 కోట్లు వెచ్చించి కేంద్రాలను నిర్మించారు. ప్రతి ఇంటికి రెండు చెత్త బుట్టలు అందించారు. నరశింగాపురం, రామిరెడ్డిపల్లి పంచాయతీ నాగయ్యగారిపల్లి సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలు 2021 నవంబరులో వచ్చిన వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గాంధీ జయంతిని పురస్కరించుకుని వాటి పునఃప్రారంభానికి చర్యలు చేపట్టింది.

మండలాల వారీగా నిర్మించిన కేంద్రాల వివరాలు

మండలం	పంచాయతీలు	కేంద్రాలు
చంద్రగిరి	21	18
పాకాల	22	22
యర్రావారిపాలెం	12	12
చిన్నగొట్టిగల్లు	13	11
రామచంద్రాపురం	14	08
తిరుపతి గ్రామీణ	34	34
తిరుపతి అర్బన్	04	01
	117	106


సుధారాణికి నియామక పత్రం అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా సుధారాణి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా ఆచార్య కె.సురెడ్డి సుధారాణి నియమితులయ్యారు. సోమవారం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు నియామక పత్రం అందజేశారు. ఆచార్య పద్మనాభం పదవీకాలం ముగియడంతో సుధారాణిని నియమించారు. ఆమె ప్రస్తుతం వయోజన విద్యా విభాగాధిపతిగా ఉన్నారు. 1992లో అదే విభాగంలో ఆచార్యులుగా చేరారు.

మానసిక ప్రశాంతతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న వైద్యులు

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: మానసిక ప్రశాంతతతోనే వృద్ధులు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. రాస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. రాస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. యూనియన్ బ్యాంక్ డీజీఎం రాంప్రసాద్ మాట్లాడారు. వృద్ధులకు రూ.50వేల విలువ చేసే స్టీల్ పళ్లేలను బ్యాంక్ తరఫున అందించారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడారు. **తిరుపతి(వైద్యవిభాగం):** ప్రతిఒక్కరూ గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రుయా కార్డియాలజి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీ హరీష్ అన్నారు. స్విమ్స్ ఓపీడీ బ్లాక్‌లో అవగాహన సదస్సు జరిగింది.

పరిసరాల శుభ్రత బాధ్యతగా భావించాలి


వినాయక సాగర్ పరిసరాలు శుభ్రం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి


జీవకోన (తిరుపతి), న్యూస్‌టుడే: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా భావించాలని, తద్వారా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రమవుతాయని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా వినాయకసాగర్ పరిసరాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యతో కలిసి శుభ్రపరిచారు.

ఇన్‌ఛార్జి సీఎస్ఆర్ఎంవోగా శ్రీనివాస్



తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రుయా ఇన్‌ఛార్జి సీఎస్ ఆర్ఎంవోగా డా.శ్రీనివాస్‌ను నియమిస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన తూర్పు గోదావరి జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎస్‌ఎంవోగా పనిచేశారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ఉన్న ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించి రుయా ఆస్పత్రికి బదిలీ చేశారు. సీఎస్ ఆర్ఎంవో స్థానం ఖాళీగా ఉండటంతో డీసీఎం ఆర్ఎంఓగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు.

రోడ్డు ఆక్రమించి.. షెడ్డు నిర్మించి



తిరుపతి పోస్టల్ కాలనీలో రోడ్డును ఆక్రమించి ఏకంగా రేకుల షెడ్డు నిర్మించారు. కాలనీలోని 5వ క్రాస్‌లో హరిత అపార్ట్‌మెంటుకు ఎదురుగా వైకాపా అనుచరుడు రోడ్డును ఆక్రమించడంపై స్థానికులు ప్రశ్నించినా ఖాతరు చేయలేదు. అపార్ట్‌మెంట్, కాలనీవాసులతోపాటు అదేవీధిలోని ఖాళీ ప్లాట్లకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతుండటంపై ఆవేదన వ్యక్తమవుతోంది. సమస్యపై నగరపాలక అధికారులు, పోలీసులకు గతంలో ఫిర్యాదు చేశామని, ప్రస్తుత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఆటోనగర్ (తిరుపతి)**

నేల బావిని పట్టించుకోండి సారూ..!



అలిపిరి పాదాల మండపం వద్దనున్న నేలబావి వ్యర్థాలతో అపరిశుభ్రంగా మారింది. ఇక్కడ నిత్యం శ్రీవారి భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. రాజులు, రాజ్యాలు పోయినా చరిత్రకు సాక్ష్యంగా పలు కట్టడాలు ఉన్నాయి. అధికారులు పర్యవేక్షించి బావిలో ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించే ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.
- ఈనాడు, తిరుపతి

తెలుగు గంగ వృథా



నగర పరిధిలోని అక్కారంపల్లె సమీపంలో తెలుగు గంగ వృథా అవుతోంది. గ్రాండ్ వరల్డ్ రోడ్డుకు సమీపంలో కరకంబాడి మార్గంలోని గొట్టాల నుంచి నీరు లీకవుతోంది. రోడ్డుకింద పైపులైన్ మ్యాన్‌హోల్‌కు పగుళ్లు ఏర్పడటంతో నీరు పెద్దఎత్తున ఉబికి వస్తూ రోడ్డుపై నిలిచిపోతోంది. నాలుగు రోజులుగా సమస్య నెలకొంది.
- జీవకోన (తిరుపతి), న్యూస్‌టుడే

సప్లిమెంటరీ ఫలితాలు

మహిళా వర్సిటీ (తిరుపతి): శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో ఆగస్టులో నిర్వహించిన బీటెక్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు పరీక్షల కార్యాలయం అధికారులు తెలిపారు. నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసి వర్సిటీ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు.

'పరీక్షల ఫీజుల పేరుతో అధిక వసూళ్లు'

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ పరిధిలోని కొన్ని ప్రైవేటు కళాశాలలు డిగ్రీ పరీక్షల రుసుం పేరుతో అదనంగా రూ.3,500 వరకు వసులు చేస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వీసీ అప్పారావుకు ఫిర్యాదు చేశారు. పెంచిన సెమిస్టర్ పరీక్షల రుసుం తగ్గించాలని విన్నవించారు. ● ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులు లేకుండానే నగరంలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల బోర్డుపెట్టి విద్యార్థులను, తల్లిదండ్రులను యాజమాన్యం మోసగిస్తోందని, కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డికి ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఫిర్యాదు చేశారు.

ఆహ్లాద వాతావరణంతో ఆరోగ్యం మెరుగు

తిరుపతి(వైద్యవిభాగం): ఆహ్లాద వాతావరణంలో జీవించడంతో వృద్ధుల ఆరోగ్యం మెరుగుపడుతుందని డీఎంహెచ్‌వో శ్రీహరి, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా రుయా ఆస్పత్రిలోని జీరియాట్రిక్ వార్డులో సమావేశం నిర్వహించారు. వ్యాయామం, ధ్యానం, యోగా చేయాలని సూచించారు. వైద్యులు సురేష్, వెంకటరమణ, శ్రీనివాసరావు, పద్మావతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి అధిక ప్రాధాన్యం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. మంగళవారం 35వ డివిజనల్ నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. శ్రీధర్, లక్ష్మి, మైనం సురేష్, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంగళం స్కూల్‌కు వితరణ

మంగళం(తిరుపతి),న్యూస్‌టుడే: మంగళంలోని ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీక్లబ్ ప్రతినిధులు మంగళవారం క్రీడా సామగ్రిని అందజేశారు. రోటరీక్లబ్ ప్రెసిడెంట్ సోము రవికుమార్, హెచ్ఎం కేశవులునాయుడు, రోటరీక్లబ్ కార్యదర్శి రాజేష్‌కుమార్, ప్రతినిధులు శరణ్‌రెడ్డి, లక్ష్మీపతి, మునస్వామిశెట్టి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

బహుమతులు అందజేత

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: చెకుముకి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు జనవిజ్ఞాన వేదిక నగర్ కార్యదర్శి రఫీ తెలిపారు. తిరుపతిలో 38 పాఠశాలల్లో పోటీలు నిర్వహించామని, మంగళవారం బహుమతులు అందజేసినట్లు వెల్లడించారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

తిరుపతి (బైరాగిపట్టెడ): తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో 'ట్రాన్స్‌లేషన్ టెక్నిక్స్ అండ్ ఛాలెంజెస్' అనే అంశంపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఉపకులపతి రాణీసదాశివ మూర్తి పాల్గొన్నారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆర్జే రమాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి గ్రామీణ: కందులవారిపల్లి పంచాయతీ పరిధిలోని శేషాచల అడవుల్లో స్వయంభువుగా వెలసిన టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీశేషాచల లింగేశ్వర స్వామి ఆలయంలో 3 నుండి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ అధికారి వెంకటేష్ తెలిపారు.

వ్యర్థాలతోనూ అవసరమైన పదార్థాల తయారీ

పాకాల, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ మొహిద్దీన్ బాషా అధ్యక్షతన మంగళవారం 'జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి మాసులామణి, అధ్యాపకులు రమేష్‌కుమార్, మోహన్‌బెహరా, ఆదిశేఖర్‌రెడ్డి, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమికి జీవం

రామచంద్రాపురం: ప్రకృతి వ్యవసాయం సాగు ద్వారా భూమికి జీవం పోయొచ్చని వ్యవసాయ శాఖ, జిల్లా వనరుల కేంద్రం శిక్షణ సమన్వయకర్త ఏడీఏ భాస్కరయ్య అన్నారు. కుప్పంబాదూరు రైతు సేవా కేంద్ర ఆవరణలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాలరావు, డా.వజిత, పి.సుమాంజలి, నీలమ్మ, ఎంటీ రంగయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 15 మందికి జరిమానా

తిరుపతి (లీగల్): నగరంలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 15 మంది వాహన చోదకులు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ నాలుగో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించినట్లు కోర్టు పర్యవేక్షకులు సుబ్బారెడ్డి, కోర్టు పోలీసు గిరి తెలిపారు.

వాహనాల చోరీ కేసులో ఇద్దరికి జైలు

తిరుపతి (లీగల్): రెండు ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరు నిందితులు ఒక్కొక్కరికి ఆరునెలల జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు వెలువరించినట్లు ఈస్ట్ పోలీసుస్టేషన్ సీఐ శ్రీనివాసులు, కోర్టు పోలీసు తెలిపారు. రైల్వేకోడూరుకు చెందిన కలిశెట్టి సుబ్రమణ్యం అలియాస్ మణి, గిద్దలూరు సుబ్రమణ్యంలు చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు.

బంగారు నగల చోరీ కేసులో..

తిరుపతి (లీగల్): తూర్పు పోలీసుస్టేషన్ పరిధిలో బంగారు నగలు చోరీ కేసులో నిందితునికి ఆరునెలల జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు వెలువరించినట్లు సీఐ శ్రీనివాసులు, కోర్టు పోలీసు తెలిపారు. బెంగళూరు అనేకల్లు తాలుకాకు చెందిన ఎంజీ వినోద్ అలియాస్ నీరు మజ్జిగ అలియాస్ ఉదయ్ మరో వ్యక్తి కలిసి 2024 జనవరి 13న తిరుపతి సుందరయ్య నగర్‌లో ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో అక్రమంగా చొరబడి 64గ్రాముల బంగారు చోరీ చేశారు.

'దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి'

పాకాల, న్యూస్‌టుడే: వెంకటగిరి పోలేరమ్మ జాతరలో కాంపాళెంకు చెందిన దళిత యువకుడు చంద్రశేఖర్‌పై దాడికి పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలని కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


లక్ష్మి, లేహ

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పరిమళ తెలిపారు. తుమ్మలగుంట మైదానంలో జిల్లాస్థాయి జట్ల మధ్య కబడ్డీ పోటీలను నిర్వహించారన్నారు. వాటిలో ప్రతిభచూపి అండర్-19 విభాగంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న లక్ష్మి, ప్రథమ సంవత్సరం విద్యార్థిని లేహ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కళాశాల వ్యాయామ ఉపాధ్యాయిని సుజాత, అధ్యాపకులు వారిని అభినందించారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో..


లక్ష్మి, అఖిల్

రామచంద్రాపురం: కేకేవీపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-19 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. 9వ తరగతి చదువుతున్న ఇ.లక్ష్మి, యు.అఖిల్ రేణిగుంట బాలికల పాఠశాల ఆవరణలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు.

ఎక్సైజ్ సీఐగా ఫణీంద్ర



చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి డివిజన్ ఎక్సైజ్ సీఐగా కేవీఎస్ ఫణీంద్ర, ఎస్సైలుగా ఎం.సుధాకర్‌రావు, కె.గిరి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మరో ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లు బాధ్యతలు చేపట్టారు. ఫణీంద్ర మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నిషేధిత మాదకద్రవ్యాల కట్టడిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

లాక్రోస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం


గెలుపొందిన ట్రోఫీతో రాష్ట్ర జట్టు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: జాతీయస్థాయి లాక్రోస్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు సత్తాచాటిందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ వేదికగా గతనెల 26 నుంచి 30 వరకు జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రాతినిధ్యం వహించింది. జూనియర్ బాలుర విభాగంలో ప్రథమ స్థానం, ఫెడరేషన్ కప్ పురుషుల విభాగంలో తృతీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. బాలుర విభాగం నుంచి ముగ్గురు, బాలికల విభాగం నుంచి ఒకరు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రారంభం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ సెనేట్ హాల్‌లో మంగళవారం నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షులు పి.సుందరరాజు, మోహన్ అధ్యక్షతన 'దక్షిణాదిలో సుప్రీం కోర్టు బెంచ్ అవసరం, దాని ఆవశ్యకత' అనే అంశంపై సదస్సు, నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, ఉస్మానియా వర్సిటీ మాజీ డీన్ గాలి వినోద్ కుమార్, భాజపా నేత జి.భానుప్రకాష్‌రెడ్డి, సీనియర్ అడ్వకేట్ కేఎస్.వాసు తదితరులు పాల్గొన్నారు.



సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

శ్రీకాళహస్తి
•శ్రీకాళహస్తి • సత్యవేడు

కూర్చున్న చోటే మండపం


బస్టాండ్ కూడలిలోని గాంధీ మండపం ●రైల్వేస్టేషన్ సమీపంలోని జీపుస్టాండ్ వద్ద గాంధీ దంపతుల విగ్రహాలు

రేణిగుంట, న్యూస్‌టుడే: మహాత్మ గాంధీకి రేణిగుంటతో ప్రత్యేక్ష అనుబంధం ఉంది. రేణిగుంట బస్టాండ్ సమీపంలో మహాత్మాగాంధీ విగ్రహ మండపాన్ని ఏర్పాటు చేశారు. 1931 సంవత్సరంలో ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా రేణిగుంటలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. ప్రస్తుత మండపం ఉన్న ప్రదేశంలో ఆయన కూర్చొని ప్రజలతో ముచ్చటించారు. దీనికి గుర్తుగా ఇక్కడ మండపాన్ని నిర్మించారు. ఎటువైపు కూర్చున్నారో అదే విధంగా నిర్మించారు. 1949 డిసెంబర్ 30వ తేదీన దీని నిర్మాణాన్ని చేపట్టారు. అదే విధంగా రైల్వేస్టేషన్ సమీపంలోని జీపుస్టాండ్ వద్ద మహాత్మగాంధీ, కస్తూరి బా దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. 1960 దశకంలో రైల్వే కార్మికుల కోరిక మేరకు ప్రముఖ నటులు కాంతారావు, రాజనాల ఇక్కడికి విచ్చేసి ఈ విగ్రహాలను ఆవిష్కరించారు. అయితే గాంధీ దంపతుల విగ్రహాలు ఇక్కడ మినహా ఈ ప్రాంతంలో ఎక్కడా లేవు.

శ్రీకాళహస్తిలో నడయాడిన బాపు
- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి


స్మృతిపథం.. బాపు రూపం

స్వాతంత్రోద్యమంలో అహింసను ఆయుధంగా చేసుకుని ఉద్యమించిన మహనీయుడు గాంధీజీ. దేశానికి స్వాతంత్ర్యం సాధించుకున్న నేపథ్యంలో జాతిపితయ్యారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో మహాత్ముని విగ్రహాల ఏర్పాటు వెనుక చరిత్ర దాగి ఉంది.

బాపు నడయాడిన వీధి

యావత్తు ప్రజలు స్వాతంత్ర ఉద్యమంలో భాగస్వాములు కావాలని.. ప్రజలను అహింస పోరాటాలకు ఏకతాటిపై నడిపించేందుకు గాంధీ మహాత్ముడు కంకణబద్ధులయ్యారు. ఆ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఆయన పలు ప్రాంతాలు సందర్శించారు. 1942న క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా చెన్నై (ఒకప్పటి మద్రాసు) వెళ్తూ శ్రీకాళహస్తికి వచ్చారు. గాంధీజీకి ఇక్కడి జనం అడుగడుగునా నీరాజనాలు పలికారు. సువర్ణముఖి నదిలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ రోజు రాత్రి.. పట్టణంలోని గోపాలవనంలోని జమిందార్ల భవనంలో బస చేశారు. గాంధీ ఉండటంతో ఆ భవనాన్ని గాంధీ భవనంగా పిలుస్తూ వచ్చారు. నడిచి వెళ్లిన వీధి గాంధీవీధిగా ఖ్యాతి గడించింది. అక్కడున్న స్థానికులు, ప్రజాప్రతినిధులు వీధి ప్రారంభంలో 2018లో మహాత్ముని విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విశేషతను సంతరించుకుంది.

వ్యాపారి దేశభక్తి


వ్యాపారి ఏర్పాటు చేసిన మండపంలో మహాత్ముడు (పాత చిత్రం)

జాతిపిత గాంధీజీ స్మృతి పథంగా.. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పట్టణంలో జవిళి వ్యాపారం చేస్తున్న చలమయ్యశెట్టి ముందుకొచ్చారు. 1969 అక్టోబరు 2వ తేదీన మహాత్ముని పుట్టిన రోజు సందర్భంగా ముక్కంటి ఆలయ ప్రవేశ ద్వారమైన భిక్షాల గాలి గోపురం వద్ద మహాత్ముని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో సమాచార వ్యవస్థ లేక పోవడంతో ఎదైనా ప్రధాన సంఘటన జరిగితే పట్టణ ప్రజలందరూ తెలుసుకునేందుకు వీలుగా ఈ విగ్రహానికి దిగువ భాగంలో నల్లబోర్డు ఏర్పాటు చేశారు. దేశంలో ఆసక్తికర విషయాలన్నీ అప్పట్లో ఈ నల్లబోర్డు ద్వారా పట్టణ ప్రజలు తెలుసుకునేవారు. ప్రస్తుతం అభివృద్ధి పనుల నేపథ్యంలో ఈ గాంధీ మండపాన్ని కాస్తంత పక్కకు జరిపి నూతన నిర్మాణం చేపట్టారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఇక్కడి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

ముక్కల దాణా..!
అమ్ముడుపోని గ్రాసం నిల్వలు


గోకులంలో ముక్కలు చేసిన దాణా నిల్వలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయానికి సంబంధించి గోశాలలో అమలు చేస్తున్నట్లు సప్తగోకులంలోని గోవులకు ముక్కల దాణా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇది వరకు కండెలతో ఉన్న గ్రాసాన్ని పశువులకు దాణాగా వేస్తూ వచ్చారు. అందులో కాండం ఎక్కువగా ఉండటం, గ్రాసం ఆకులు తక్కువగా ఉండటంతో పశువులు తినడం లేదన్న ఫిర్యాదులు ఆలయ అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ప్రస్తుతం గోశాలలో అమలు చేస్తున్నట్లుగా గ్రాసం కండెలను ముక్కలు చేసి తవుడుతో కలిపి గోవులకు మేతగా వేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రకారం గ్రాసం కండెలకు బదులుగా ముక్కల దాణాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో కండెలుగా ఉంటూ వచ్చిన గ్రాసాన్ని భక్తులు రూ.20 వంతున కొనుగోలు చేసి పశువులకు తినిపిస్తూ వచ్చారు. ముక్కలు చేయడంతో భక్తులు పెద్దగా ఆసక్తి చూపకపోవడం, గ్రాసం నిల్వలు మిగిలిపోతున్నాయి.

మురుగుతో బేజారు


12వ వార్డులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

సత్యవేడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రతి రోజు విధిగా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాల్సిన అధికారుల అలసత్వం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు గాంధీ రోడ్డు, నేతాజీరోడ్డు, గంగమిట్ట వీధి, కాపు వీధుల్లో ప్రతి రోజూ పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టినా ప్రధాన కాలువలు అనుసంధానం ఉన్న కాలనీల్లో మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడంతో అడుగడుగునా రోడ్లపై మురుగు చేరి నిత్యం పాదచారులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పారిశుద్ధ్య సమస్యలు తెలుసుకుంటాం. ఎప్పటి కప్పుడు తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.
– మునిరవికుమార్, పంచాయతీ కార్యదర్శి, సత్యవేడు

సీపీఎం కరకంబాడి కార్యదర్శిగా సత్యశ్రీ

రేణిగుంట, న్యూస్‌టుడే: సీపీఎం కరకంబాడి కార్యదర్శిగా సత్యశ్రీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి హరినాథ్ తెలిపారు. మంగళవారం కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మురళి పుట్టయ్య చేతుల మీదుగా పార్టీ జెండాను ఆవిష్కరించి సమావేశం నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM) శ్రీకాళహస్తి: 80085 74555 నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సమస్య: మురుగునీటి ప్రవాహం లేక పోవడంతో ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగునీరు సజావుగా వెళ్లే విధంగా శుభ్రం చేయించగలరు.
– వినత, శ్రీసాయినిధి, శ్రీరంగనగర్ కాలనీ

సమాధానం: రోజు వారీ వ్యర్థాల తొలగింపు జరుగుతోంది. త్వరలోనే సమస్యను పరిష్కరించగలం.
– బాలకృష్ణ, పారిశుద్ధ్య విభాగం, పురపాలక సంఘం

న్యూస్‌టుడే, రేణిగుంట

సమస్య: కరకంబాడి పంచాయతీలోని ప్రధానవీధిలో కాలువల్లో చెత్త పేరుకు పోవడంతో కాలువల్లో మురుగు ముందుకు సాగడంలేదు. దీంతో ఈ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతోంది. వెంటనే పంచాయతీ పెద్దలు పరిష్కరించాలి.
– సుభాష్, కరకంబాడి

సమాధానం: ఇక్కడ సమస్య ఉన్న విషయం నా దృష్టికి వచ్చింది. వెంటనే శుభ్రత చర్యలు తీసుకుంటాం.
– యూసుఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి. కరకంబాడి

అందుబాటులోకి సమాచారం

ఈనాడు కథనాలకు స్పందన

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చే భక్తులు ఆలయంలో నిర్వహించే అభిషేక సేవలకు సంబంధించి సమాచారం అందుబాటులో లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత వాయులింగేశ్వరునితో పాటు ఇతర పరివార దేవతా మూర్తులకు జరిగే అభిషేకాలకు సంబంధించి సరైన వివరాలు, ధరలు అందుబాటులో లేక పోవడంపై గత నెల 17వ తేదీన 'సమాచారం లేక సంకటం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆలయ ఉన్నతాధికారుల సూచనల మేరకు ఇంజినీరింగ్ శాఖ దక్షిణ గోపురం పక్కన ఆర్జిత అభిషేక సేవలకు సంబంధించి ధరలతో కూడిన సూచిక బోర్డును అందుబాటులోకి తీసుకురావడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక తవ్వకాలపై చర్యలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలంలోని మునగలపాళెం సమీపంలో స్వర్ణముఖినదిలో ఇసుక అక్రమ తవ్వకాలను అధికారులు అడ్డుకున్నారు. పెద్దఎత్తున ట్రాక్టర్లతో ఇసుక అక్రమంగా తరలిస్తున్న వైనంపై ఈనాడులో మంగళవారం 'ఇసుక తవ్వకాలు అరికట్టండి సారూ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇసుక అక్రమంగా తరలిస్తే ఎంతటివారిపైనైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నదిలోకి వెళ్లకుండా కందకాలు తవ్వనున్నట్లు వివరించారు.

నేడు తెదేపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

తొట్టంబేడు: తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రివర్యులు దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆపార్టీ నేతలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా పట్టణానికి చెందిన ఎంజీఎం ఆసుపత్రి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని గాంధీ వీధి, వినాయకుని ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు.


మహాత్మాగాంధీ చిత్రపటానికి పూజలు చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘనంగా గాంధీ జయంతి

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి మండలంలోని స్కిమ్స్ ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలో మంగళవారం మహాత్మాగాంధీ జయంతిని నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ మిద్దెల హరి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూజలు చేశారు. స్వాతంత్ర్యం సాధించడంతో గాంధీ అనుసరించిన వ్యూహాలు గురించి విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ గీతాదేవి, డైరెక్టర్ శ్రీకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు


టి.దీపిక ●టి.బాలాజీ ● హిమజ

సత్యవేడు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత బాలురు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం పట్ల పాఠశాల ఉపాధ్యాయిని భారతి, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఆదివారం చంద్రగిరిలో జిల్లా స్థాయిలో అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పదో తరగతి చదువుతున్న టి.దీపిక పాల్గొన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం పట్ల అక్టోబర్ 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుంది. చిత్తూరులో జరిగిన అండర్-14 లాంగ్ జంప్ జూనియర్ బాయ్స్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న టి.బాలాజీ లాంగ్ జంప్ 4.8మీటర్లలో రాష్ట్ర స్థాయికి ఎంపికై శ్రీకాకుళంలో నిర్వహించనున్న జూనియర్ బాయ్స్ అండర్-14 లాంగ్ జంప్‌కు అర్హత సాధించారు. మదనపల్లెలో జరిగిన అండర్-14 బాలికల 30కేజీల పోటీల్లో హిమజ రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు అర్హత సాధించారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయమని తెదేపా అధికార ప్రతినిధి గురవారెడ్డి తెలిపారు. ఏర్పేడు, ఆమందూరు, మేర్లపాక, బండారుపల్లి పంచాయతీల్లో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వంద రోజుల పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు అధికారంలోకి రాగానే పెంచిన పింఛను పంపిణీ చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కృష్ణవేణి, గుణయాదవ్, కేకేరమణ, చెంచురెడ్డి, వెంకటమునినాయుడు, నవీన్ పాల్గొన్నారు.

సీఐటీయూ సమన్వయ కమిటీ సభ్యుల ఎన్నిక


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జి.బాలసుబ్రహ్మణ్యం, సీఐటీయూ సమన్వయ కమిటీలు

సత్యవేడు, న్యూస్‌టుడే: దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను, కార్మిక స్థితిగతులను కార్మికులకు సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రహ్మణ్యం గౌరవ అధ్యక్షతన సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన, ఆశా వర్కర్లు, అంబాసిడర్లు, బిల్డింగ్ మరియు ఆటో కార్మిక సంఘాల నుంచి సమన్వయ కమిటీ కన్వీనర్, సభ్యులను ఎన్నుకున్నారు. సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఎం.రమేష్, కో-కన్వీనర్‌గా డి.శాంతి ఎన్నికైయ్యారు. సభ్యులు భారతి, గీత, నిర్మల, రాములమ్మ తదితరులను ఎన్నుకున్నారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం


స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో విద్యార్థులు

నారాయణవనం, న్యూస్‌టుడే: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పుత్తూరు సిద్ధార్థ కళాశాలల ఛైర్మన్ డాక్టర్ అశోకరాజు అన్నారు. మంగళవారం కళాశాలలో మైభారత్, కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాలల ప్రిన్సిపల్స్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రాజు, రమేష్, ఎన్ఎస్ఎస్ అధికారి సురేష్, డిప్యూటీ డీఈవో ప్రభాకర్‌రాజు, ఈవో షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌కు ఘన స్వాగతం


పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తిరుమల శ్రీవారి దర్శనార్థం ఆయన మంగళవారం ప్రత్యేక విమానంలో ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో తిరుపతి అలిపిరి వద్దకు బయలుదేరి వెళ్లారు.

ఏపీఎంగా మునెయ్య బాధ్యతల స్వీకరణ



బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: వెలుగు నూతన ఏపీఎంగా మునెయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా ఇక్కడ ఏపీఎంగా పని చేస్తున్న ఇందిరమ్మ తొట్టంబేడు మండలానికి బదిలీ కాగా శ్రీకాళహస్తిలో పని చేస్తున్న మునెయ్యను ఇక్కడకు బదిలీ చేశారు. మండలంలో మహిళా సభ్యులకు అందుబాటులో ఉంటూ రుణాల మంజూరు, సంఘాల బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా మునెయ్య తెలిపారు.

గిరిజన విద్యార్థులు పుస్తకాల వితరణ

బీఎన్‌కండ్రిగ: మండలంలోని పెద్దపాలేడు పంచాయతీ పరిధిలోని మూలబొందల గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం సంజీవసింహ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా రాత పుస్తకాలను వితరణగా పంపిణీ చేశారు. పుత్తూరుకు చెందిన సంజీవ సింహ ట్రస్టు ఛైర్మన్ వెంకటేశ్వర్లు విద్యాభివృద్ధికి అందిస్తున్న సామాజికసేవలను ఎంపీడీవో త్రివిక్రమరావు, వైద్యాధికారి దివాకర్‌లు అభినందించారు.

సమ దుస్తులు..

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: పాఠశాల ప్రగతి, విద్యాభివృద్ధికి దాత నందకిషోర్‌రెడ్డి చేస్తున్న సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరాలని ప్రధానోపాధ్యాయులు రమణయ్య కోరారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్(ఇంటర్) మొదటి సంవత్సరం చదివే బాలికలకు అంబూరుకు చెందిన తెలుగు యువత నాయకుడు ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి(ఎన్ఆర్ఐ) మంగళవారం రూ.30వేల విలువైన సమదుస్తులను వితరణగా పంపిణీ చేశారు. దాతను ఉపాధ్యాయులు సన్మానించారు. పీడీ బందిల కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్తను విధిగా చెత్తబుట్టలో వేయాలి

సత్యవేడు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ చెత్తను విధిగా సేకరించి చెత్తబుట్టల్లో వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అందరూ తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డా.ఆనంద్‌రెడ్డి కోరారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్, రైతు సేవా కేంద్రం, సీహెచ్‌సీ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.ఆనంద్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్యామూల్, ఎన్ఎస్ఎస్‌పీవో హరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వ్యర్థాలను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మద్యం దుకాణాల మూత.. సిబ్బంది నిరసన


బీఎన్‌కండ్రిగలో నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: నియోజకవర్గ వ్యాప్తంగా ఉనన 32 ప్రభుత్వ మద్యం దుకాణాలను మంగళవారం మూసివేశారు. నూతన మద్యం పాలసీ విధానానికి నిరసనగా నియోజకవర్గంలో ఆయా మండలాల్లో పని చేస్తున్న సిబ్బంది మద్యం దుకాణాలను మూసివేయడంతో మందుబాబులు అవస్థలు పడ్డారు. నేటితోనే మద్యం దుకాణాల ఉద్యోగుల ఒప్పంద గడువు ముగియడంతో అయిదేళ్లుగా పని చేస్తున్న తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని కోరుతూ సిబ్బంది నియోజకవర్గవ్యాప్తంగా విధులను బహిష్కరించి దుకాణాలను మూసివేశారు. సత్యవేడు మండలంలో 9 దుకాణాలు, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, నాగాలపురం మండలాలలో అయిదు చొప్పున, పిచ్చాటూరు, కేవీబీపురం, నారాయణవనం మండలాల్లో మూడు చొప్పున మద్యం దుకాణాలు మూతబడ్డాయి. బీఎన్‌కండ్రిగలో మద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బంది తమకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతూ నిరసనకు దిగారు.

భూముల చదును.. కబ్జాలకు అదను


రామచంద్రాపురం సమీపంలో స్థలాన్ని చదును చేసిన అక్రమార్కులు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, వంకలు, వాగులకు రక్షణ కరవైంది. విలువైన ప్రభుత్వ భూములు కావడంతో ఆక్రమణలు అధికమయ్యాయి. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి సమీపంలో శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధాన రహదారి అనుకుని రూ.కోట్లు పలికే ప్రభుత్వ భూమిపై అక్రమార్కుల కన్నుపడడంతో మంగళవారం జేసీబీతో కాజేసేందుకు చదును చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ మధుసూదన్‌రావుని వివరణ కోరగా ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో సర్వేయర్‌ను పంపి పరిశీలించగా ఆభూమి శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోధికావడంతో తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

సంతవేలూరు విద్యార్థుల ప్రతిభ


జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో డిబేట్‌లో సంతవేలూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన డి.ఝూన్సీ ప్రథమ స్థానంలో నిలిచింది. వ్యాస రచనలో కే.నిచిత రెండో స్థానంలో, చిత్రలేఖనంలో భార్గవి మూడో స్థానంలో విజయం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు మాధవయ్య తెలిపారు.

జాతీయస్థాయిలో పవిత్ర..


విద్యార్థిని పవిత్రకు ప్రశంసా పత్రం అందజేస్తున్న శశికళ

నారాయణవనం, న్యూస్‌టుడే: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు శశికళ తెలిపారు. విద్యార్థిని డి.అను అటల్ సమన్వయ కర్త శ్యామలత పర్యవేక్షణలో జాతీయ స్థాయిలో జరిగిన అటల్ టింకర్‌ప్రెన్యూర్ బూట్ క్యాంప్‌ను 45 రోజులు నిర్వహించి జాతీయ స్థాయిలో 12వ ర్యాంకును కైవసం చేసుకుంది. ఎస్వీ పవిత్ర ఐటీటీ ప్రాజెక్ట్ సమర్పించి ఆవిష్కార్ అవార్డులో ప్రతిభ ధృవీకరణ పత్రాన్ని అందుకుంది. మంగళవారం వీరిని పాఠశాలలో అభినందించారు.

గోడపత్రికల ఆవిష్కరణ


శరన్నవరాత్రి వార్షిక ఉత్సవాల గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శరన్నవరాత్రి వార్షిక ఉత్సవాలను పురస్కరించుకుని గోడపత్రికల ఆవిష్కరణ మహోత్సం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలోని శ్రీమేధా దక్షిణామూర్తి సన్నిధి వద్ద గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ నెల 3వ నుంచి 12వ తేదీ వరకు ముక్కంటి ఆలయంతో పాటు అనుబంధంగా ఉన్న కనకాచలంపై ఉత్సవాలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. 12వ తేదీతో ముగియనున్నట్లు వివరించారు.

తీరిన ఇక్కట్లు: ఏటా శరన్నవరాత్రి వార్షిక ఉత్సవాల సందర్భంగా కనకాచలం ఎక్కేందుకు భక్తులు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. ఎండ తీవ్రత, లేదంటే వర్షం ఈ పరిస్థితుల్లో నిలబడేందుకు ఎక్కడా చెట్లు, షెడ్లు లేక పోవడంతో అవస్థలు తప్పేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచనలతో ఆలయ అధికారులు సుమారు రూ.30 లక్షల వ్యయంతో రెండు వైపులా ఉన్న మెట్ల మార్గానికి షెడ్లు ఏర్పాటు చేశారు. మెట్లపై భక్తులు కర్పూరం వెలిగించకుండా అధికారులు చర్యలు చేపడితే భక్తులకు ఇబ్బందులు తొలగుతాయి.

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణ వ్యాప్తంగా పింఛన్ల పంపిణీని పకడ్బందీగా పూర్తి చేశారు. పురపాలక సంఘ కమిషనర్ బి.ఎస్.గిరికుమార్ ఆదేశాలతో సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయాన్నే కూటమి నేతలు, కార్యదర్శుల సంయుక్త పర్యవేక్షణలో పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. రాత్రి ఏడు గంటల సమయానికి 8942 మందికి గాను 8815 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

పల్లెల చెంతకు అధికారులు


నాగలాపురం: గోడపత్రికల ఆవిష్కరణలో అధికారులు, నేతలు

నాగలాపురం, న్యూస్‌టుడే: పొలం పిలుస్తోంది కార్యక్రమంతో నాగలాపురం, పిచ్చాటూరు మండలాల్లోని పల్లెల చెంతకు అధికారులు మంగళవారం వెళ్లారు. నాగలాపురం మండలంలోని కారణి, పిచ్చాటూరు మండలంలోని శేషంబేడు, రామగిరి అప్పంబట్టు గ్రామాల్లో కార్యక్రమ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఏవోలు సుబ్బారావు పాల్గొన్నారు. **శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు):** ఏడీఏ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలంలోని వేడాం పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. **వరదయ్యపాళెం:** ఏపీడీ సుబ్రహ్మణ్యం ఆధర్యంలో అయ్యావారిపాళెం, కురుంజలంలలో కార్యక్రమాలను నిర్వహించారు. **తొట్టంబేడు:** ఏవో సురేంద్రరెడ్డి ఆధర్యంలో కాసరంలో కార్యక్రమాలను చేపట్టారు.

ఇసుక లారీల స్వాధీనం

రేణిగుంట, న్యూస్‌టుడే: గాజులమండ్యం పోలీసు స్టేషన్ పరిధిలో స్వర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సెబ్ అధికారులు తూకివాకం నుంచి తుడా ప్లాట్లకు వెళ్లే మార్గంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో స్వర్ణముఖి నది వద్ద రెండు లారీలు ఇసుక తరలిస్తుండటంతో దాడులు చేసి స్వాధీనం చేసుకుని గాజులమండ్యం పోలీసులకు అప్పగించారు.

ద్విచక్ర వాహనం చోరీ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసముంటున్న హరినాయుడు ఇంటి ముందు సోమవారం రాత్రి వాహనాన్ని పార్కింగ్ చేశారు. ఉదయాన్నే వాహనం కన్పించకుండా పోవడంతో మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంట్లో నీళ్లు పడ్డాయని మహిళపై దాడి

వరదయ్యపాళెం: కారిపాకంలో హేమలత తన ఇంటివద్ద నీటితో కడుగుతుండగా ఆ నీళ్లు తమ ఇంట్లోకి వచ్చాయని ఎదురింటిలో ఉంటున్న శ్రీధర్ గొడవ పడ్డాడు. దీంతో శ్రీధర్ భార్య భారతి ఆగ్రహంతో కర్రతో హేమలత తలపై కొట్టడంతో ఆమెకు తీవ్రగాయమైంది. శ్రీధర్ తమ్ముడు శేఖర్ బెదిరించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కేబీ మల్లికార్జున్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పల్లం విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు ఆనంద్, ఉపాధ్యాయ బృందం

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైయ్యారు. ఇటీవల వడమాలపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీల్లో అండర్-14 విభాగంలో హర్షవర్ధన్ 35, నాగరాజు 45కేజీలు, అండర్-17 గ్రీకో రెజ్లింగ్ పోటీల్లో సూర్య 45, మోహనాచారి 60 కేజీల పోటీల్లో సత్తాచాటారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రధానోపాధ్యాయులు ఆనంద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయురాలు పుష్పవాణిని అభినందించారు. కృష్ణాజిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

సృజనాత్మకత వెలికితీతకు ప్రయత్నం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను చెకుముకి పోటీల ద్వారా వెలికితీయడం జనవిజ్ఞాన వేదిక ప్రయత్నమని జిల్లా నేత ఎస్ఎం షరీఫ్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక నేతృత్వంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పిల్లలు సొంతంగా ఆలోచించి నైపుణ్యం సాధించాలన్నారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాల పరిధిలో 120 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. 18 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. చెంచయ్య పాల్గొన్నారు.



గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 60 నుంచి రూ. 80 వరకు

రెండో రకం: కిలో రూ. 50 నుంచి రూ. 60 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	121
లేయర్	110
బ్రాయిలర్స్	218
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	244
లేయర్ మాంసం	187

'వారాహి' విజయవంతానికి పిలుపు

వెంకటగిరి: తిరుపతిలో గురువారం నిర్వహించే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారాహి సభను నియోజకవర్గంలోని జనసేన నేతలు విజయవంతం చేయాలని నియోజకవర్గ నేత తోట కృష్ణయ్య కోరారు.

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

చీరల పంపిణీ

సూళ్లూరుపేట: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పట్టణంలోని బాపూజీకాలనీలో డబ్ల్యూఓవీ ఎస్ఎస్ఎస్ అధ్యక్షురాలు శాంత కుమారి ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించారు. వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

న్యూస్‌టుడే, బాలాయపల్లి

సమస్య: పెరిమిడి పంచాయతీ బొల్లవారిపాళెం మధ్యలో తారు రోడ్డుకు ఇరువైపులా ఉండే కంప చెట్లు కమ్ముకుని రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. మలుపులు ఉండే చోట్ల ఈ పరిస్థితి వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. – గోపాల్ నాయుడు, బొల్లవారిపాళెం

సమాధానం: రోడ్డుకు అడ్డంగా కమ్మేసిన కంప చెట్లను తొలగించడానికి మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ బాబు, ర.భ. ఏఈ

న్యూస్‌టుడే, వెంకటగిరి

సమస్య: పట్టణంలోని తూర్పు వీధిలోని సాయిబాబా మందిరం ఎదుట కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. భక్తులు ఇబ్బంది పడుతున్నారు. – కోటేశ్వరరావు, వెంకటగిరి

సమాధానం: కాలువలో వ్యర్థాలు తొలగిస్తాం. – రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

సమస్య: రాజగోపాలపురం ఐదో వీధి మలుపులో గ్యాస్ పైపులైన్లకు గోతులు తీసి సరిగా పూడ్చలేదు. రాత్రి వేళల్లో ప్రజలు కింద పడుతున్నారు. – సతీష్, స్థానికుడు

సమాధానం: సమస్య పరిష్కరిస్తాం. – ఫజులుల్లా, కమిషనర్

చెట్ల తొలగింపు

స్పందనకు వందనం

నాయుడుపేట పట్టణం: స్థానిక కోళ్లపారం కాలనీలోని విద్యుత్తు స్తంభం చుట్టూ పెద్ద చెట్లను పురపాలక సిబ్బంది తొలగించారు. ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

మంత్రి లోకేశ్ 'ప్రజా దర్బార్'కు వినతుల వెల్లువ

తాడేపల్లి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరించారు. అందరినీ మంత్రి ఆప్యాయంగా పలకరించడంతోపాటు సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. కోటలోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన ఉపాధ్యాయేతర సిబ్బందికి ట్రిబ్యునల్ తీర్పు అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు.

తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో నిత్యం తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. దాంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. దీనిపై డిస్కం సిబ్బందిని ప్రశ్నిస్తే కుంటిసాకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళ సరఫరాలో అంతరాయాలు ఎక్కువగా ఉంటున్నాయి. పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డు, బజారు వీధులు, పరమేశ్వరినగర్, సాయినగర్, ఆర్డీవో కార్యాలయం, తదితర ప్రాంతాల్లో సరఫరాలో తరచూ లోపాలు తలెత్తున్నాయి. దాంతోపాటు సరఫరాను సిబ్బంది ఇష్టానుసారంగా ఆపేస్తున్నారు. దీనిపై వినియోగదారులకు ముందస్తు సమాచారం ఉండటం లేదు. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళ విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మన్నేముత్తేరి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని షార్ ఉద్యోగుల నివాస కాలనీలు, శ్రీహరికోట రోడ్డు, తహసీల్దార్, ఎంపీడీవో, ప్రభుత్వ ఆసుపత్రి, తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో లోపాలు తరచూ వస్తున్నాయి.

ఆలయాల్లో అన్యమతస్థులను తొలగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాల్లో అన్యమతస్థులను తొలగించాలని విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందించారు. వీహెచ్‌పీ ప్రతినిధులు సుంకర ప్రతిమ, కమ్మిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, నారాయణ, పాల్గొన్నారు.



నాయుడుపేట: ఎల్ఏసాగరం పాఠశాల్లో ప్రశంసాపత్రాలతో విజేతలు

చెకుముకి ప్రతిభా పరీక్ష

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లోని విద్యార్థులకు చెకుముకి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డాక్టర్ ధనంజయ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. జేవీవీ ప్రతినిధులు చంద్రశేఖర్, రాజేష్‌బాబు, రామ్మూర్తి, శామ్యూల్, కే.శేఖర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నాయుడుపేట పట్టణం: స్థానిక లోతువానిగుంట ఉన్నత పాఠశాల్లో మంగళవారం చెకుముఖి మండల స్థాయి ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయికి పలువురు ఎంపికయ్యారు. ఎంఈవో మునిరత్నం, హెచ్ఎం అన్నామణి, జనవిజ్ఞానవేదిక నాయకులు కుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.50 వేల సాయం



మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు చెక్కు ఇస్తున్న తాళ్వాయపాడు వాసులు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం తాళ్వాయపాడు తెదేపా నేతలు వరద బాధితులకు రూ. 50 వేలు చెక్కు అందజేశారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ద్వారా దీనిని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపనున్నట్లు తెలిపారు. నేతలు ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, కిలారి గోపీయాదవ్, గంగాబత్తిన శ్రీనివాసులు, బాలయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల మాటున మట్టి దోపిడీ

- సాగరమాల రోడ్లపై సాకు
- స్థిరాస్తి క్షేత్రాలకు తరలింపు



చిట్టేడు సమీపంలో తవ్వకాలు

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గంలో మట్టి మాఫియా చెలరేగుతోంది. అనుమతులు గోరంత తీసుకుని చెరువంతా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. పగలు రాత్రీ తేడా లేకుండా భారీ యంత్రాలతో తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నా అధికారులు ప్రశ్నించే ధైర్యం చేయడం లేదు. రూ.కోట్ల విలువ చేసే ప్రకృతి సంపద దోచేస్తున్నా అడిగే దిక్కులేకుండా పోతోంది.

ప్రైవేటు లేఅవుట్‌లకు సరఫరా

గ్రామీణంతో పాటు, చిల్లకూరు, కోట, చిట్టమూరు తదితర ప్రాంతాల్లోని చెరువుల్లో మట్టి మాఫియా భారీగా తవ్వకాలు చేపడుతోంది. భారీ యంత్రాలు వాడి టిప్పర్లలో ప్రైవేటు వెంచర్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువుల్లో మట్టి తవ్వకాలకు అనుమతి తీసుకుని నిబంధనల మేరకు మూడు అడుగులు మాత్రమే తవ్వాలి. కానీ 15-20 అడుగుల మేర గోతులు పెడుతున్నారు. కోట మండలం టవర్ కాలనీ, చంద్రశేఖర్‌పురం వద్ద చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. మట్టిని సాగరమాల రహదారి కోసం అనుమతి తీసుకుని బయటకు తరలిస్తున్నారు. ఇలా లారీ రూ.12 వేల వరకు విక్రయించి భారీగా ఆర్జిస్తున్నారు.

రవాణా శాఖ నిద్దరోతుందా!

అనుమతికి మించి లోడ్‌తో వాహనాలు వెళ్తున్నా రవాణా శాఖ నిద్ర నటిస్తోంది. సాధారణంగా చెరువుల్లో మట్టి తవ్వకాలకు రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ శాఖల అనుమతులు తీసుకోవాలి. అధికారులు నిర్దేశించిన స్థలంలోనే మట్టి తవ్వాలి. వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి తీసుకుని లక్షల క్యూబిక్ మీటర్లు తరలిస్తున్నారు. పరిమితికి మించి లోడ్‌తో వాహనాలు రోడ్ల మీద వెళ్తున్నా కనీసంగా రవాణా శాఖ తనిఖీలు చేసే పరిస్థితి లేదు.

కంట్లో దుమ్ము కొడుతున్నా..

చిల్లకూరు మండలం కలవకొండ వద్ద స్థానికులు మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. ఇక్కడ వాహనాల వల్ల రోడ్లు గుల్ల కావడంతో పాటు మితిమీరిన వేగం. దుమ్ము.. ధూళి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోందని ఆందోళనకు దిగారు. ఇక్కడ వాహనాలు ఆపేసినా మళ్లీ యథాతథంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు.

చెరువులు చెరిపేసి..

కోట మండలం చంద్రశేఖరపురం చెన్నప్ప గారి చెరువులో అక్రమంగా మట్టి తరలింపును స్థానికులు అడ్డుకున్నారు. ఇక్కడ 140 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే ప్రమాదముందని స్థానికులు వాపోయారు. 10 అడుగుల మేర తవ్వకాలు చేస్తున్నట్లు వాహనాలు అడ్డుకుని తరిమేశారు.

● దీనిపై ఏడీ రంగకుమార్‌ని వివరణ కోరగా నిఘా పెట్టి ఉంచామన్నారు. నిల్వల వద్ద పెనాల్టీలు వేయనున్నట్లు తెలిపారు.



లబ్ధిదారుకు పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



గూడూరులో పాల్గొన్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

చంద్రన్న పాలనలో తంచనుగా పింఛను

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా, వరదలు వచ్చినా చంద్రన్న పాలనలో ప్రతి నెలా లబ్ధిదారులకు తంచనుగా ఒకటో తేదీనే పింఛను అందిస్తున్నారని ఎమ్మెల్యేలు, కూటమి నేతలు పేర్కొన్నారు. మంగళవారం గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

– న్యూస్‌టుడే బృందం



నాయుడుపేట: రాచపాళెంలో దివ్యాంగురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

పారిశుద్ధ్య కార్మికుల హాజరు పరిశీలన

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: స్థానిక పురపాలక సంఘంలో మంగళవారం కమిషనర్ చిన్నయ్య ఆకస్మికంగా సచివాలయాల వద్ద పారిశుద్ధ్య కార్మికుల హాజరు, క్షేత్రస్థాయిలో వారి పనితీరును పరిశీలించారు. కార్మికుల పనితీరుపై ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

వాకాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన ప్రైవేటు మద్యం దుకాణాల కోసం దరఖాస్తులను స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కార్యాలయంలో ఆయన మీడియాతో నిర్వహించారు. దరఖాస్తుల స్వీకరణకు కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, ఈ నెల 9వ తేదీ వరకు స్వీకరిస్తామని చెప్పారు.



వాకాడు: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వాకాడు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వాకాడులోని బీఆర్.అంబేడ్కర్ గురుకులం కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి కళాశాల ప్రిన్సిపల్ విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం వారందరిని ఆయనతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు అభినందించారు.

● **గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** గూడూరు మండలానికి చెందిన జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, నెల్లటూరు జడ్పీ పాఠశాల, చెన్నూరు జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థులు కౌసల్య, వెంకటకార్తీక్, యుంగధర్‌సాయి, కార్తీక్, తేజ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీలు వియజకళ, విజయ, జమీలా తెలిపారు.

2 నుంచి శరన్నవరాత్రులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఈ నెల 3వ తేదీ నుంచి జరిగే ముక్కంటి శరన్నవరాత్రి ఉత్సవాల గోడపత్రులను శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారులు మంగళవారం ఆవిష్కరించారు.

వృద్ధులు చట్టాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేష్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: వృద్ధుల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్ తెలిపారు. పట్టణంలోని ఓం సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. వృద్ధాప్యంలో బిడ్డలు పట్టించుకోకపోతే వారి నుంచి చట్ట ప్రకారం వచ్చే ప్రయోజనాలు పొందవచ్చని జడ్జి చెప్పారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్మా.. మన్నించు



వెంకటగిరి, న్యూస్‌టుడే: సమావేశాలు, సభల్లో దేశ నేతల త్యాగాలను నేతలు కీర్తిస్తుంటారు. కానీ వారి విగ్రహాలు శిథిలమైనా వారి కంటికి కనిపించవు. ప్రత్యేక దినోత్సవాల్లో పూలదండలు వేసి వెళ్తుంటారు తప్ప పట్టించుకోరు. ఫలితంగా అలనాటి మహాత్ముల విగ్రహాలు దయనీయస్థితిలో ఉన్నాయి. అందుకు నిదర్శనమే పట్టణంలోని గాంధీ మహాత్ముని విగ్రహం. తూర్పువీధిలో 1946లో అప్పటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో స్వపరిపాలనశాఖ మంత్రిగా ఉన్న చంద్రమౌళి చేతుల మీదుగా గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ ప్రాంగణానికి గాంధీ పార్కుగా నామకరణం చేశారు. గ్రామ పంచాయతీకి దీని నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. కాలక్రమేణా మున్సిపాలిటీగా అభివృద్ధి చెందినా అధ్వానంగా ఉన్న విగ్రహానికి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. దీంతో విగ్రహం రూపురేఖలు మారిపోవడమే కాకుండా పెచ్చులూడిపోయి, రంగు వెలిసిపోయింది. గాంధీ పార్కు ప్రాంగణం చెత్తాచెదారంతో నిండిపోయింది. పార్కు ముందు భాగంలో గత కాంగ్రెస్ పాలకులు గ్రంథాలయ భవనాన్ని నిర్మించడంతో వెనుక భాగంలో ఉన్న పార్కు స్థలం నిరుపయోగంగా మారింది.

భూములపై విచారణ

కోట: వజ్జావారిపాళెంలో పేదల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ అటవీ భూములను కొందరు స్థానికేతరులు ఆక్రమించుకొని అమ్ముకొంటూన్నారనే పేదల ఫిర్యాదు మేరకు మంగళవారం తహసీల్దారు జయజయరావు విచారణ చేశారు. పేదలను అడిగి వివరాలు సేకరించారు. భూములను పరిశీలించారు.

నిత్యావసరాల వితరణ

చిట్టమూరు(కోట), న్యూస్‌టుడే: చిట్టమూరులోని పట్టాభిరామాలయం నడుపుతున్న కృష్ణమూర్తి, యమునాదేవి దంపతులకు వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల ఆర్థిక దాతృత్వంతో రూ.5 వేల నిత్యావసరాలను సీతారామ ధార్మిక సంస్థ ప్రతినిధి తేజోవతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి దీవి అనంతచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలు

కోట, న్యూస్‌టుడే: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో మంగళవారం గాంధీ జయంతి పురస్కరించుకొని విద్యార్థులకు 'డజ్ గాంధీస్ విజన్ మీట్ త్రు వికసిత్ భారత్' అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

గుమ్మళ్లదిబ్బలో స్వచ్ఛతా హీ సేవా

చిల్లకూరు, న్యూస్‌టుడే: గుమ్మళ్లదిబ్బ గ్రామంలో మంగళవారం అదానీ ఫౌండేషన్, కృష్ణపట్నం పోర్టు సమన్వయంతో స్థానిక పాఠశాలల్లో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలల ప్రాంగణాల్లో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ప్రతినిధులు రాజేష్ రంజన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు తరగతులు నిర్వహించకుండా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకుడు చిన్నా డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు.

సాంకేతిక సదస్సు



సావనీర్ ఆవిష్కరణలో విభాగాధిపతులు, విద్యార్థులు

కోట, న్యూస్‌టుడే: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో మంగళవారం ఐఈఈఈ విభాగం ఆధ్వర్యాన కోడ్‌మానియా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు డీబగ్గింగ్ పోటీలను నిర్వహించారు. పాల్గొని ప్రతిభ చూపారు. కోడ్ మానియా సావనీర్ ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు రాజశేఖర్‌రెడ్డి, హరనాథ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



దొరవారిసత్రం: కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారిణి యామిని, రైతులు



నాయుడుపేట: కాపులూరులో సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సేంద్రియ పద్ధతిలో సాగు మేలు

కోట, న్యూస్‌టుడే: వెంకన్నపాళెం, తిన్నెలపూడి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన మంగళవారం వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అన్నదాతలకు నిర్వహించారు. సేంద్రీయ పద్ధతిలో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు పొందే అవకాశముందన్నారు. ● **దొరవారిసత్రం:** రాష్ట్ర ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూళ్లూరుపేట ఉద్యానశాఖాధికారిణి యామిని సూచించారు. వేణుంబాకలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ● **వాకాడు:** వాకాడు, గొల్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. పశువైద్యశాల సహాయ సంచాలకులు రమణయ్య, ఏవో దీప, మాజీ సర్పంచి భార్గవ రామ్, తెదేపా నేతలు కృష్ణారెడ్డి, చంద్రయ్య, సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు. ● **నాయుడుపేట:** కాపులూరు, కుచివాడ గ్రామాల్లో రైతులకు సేంద్రీయ సాగుపై తిరుపతి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ప్రసాద్, ఠాగూర్‌లు అవగాహన కల్పించారు. ఏవో గణేష్ పాల్గొన్నారు. ● **పెళ్లకూరు:** పాలచ్చూరులో రైతులకు ఏవో ప్రవీణ సదస్సు నిర్వహించారు. ● **వెంకటగిరి:** యాతలూరు గ్రామంలో కేవీకే శాస్త్రవేత్త నాగార్జునరెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ నాగార్జున సాగర్, ఉద్యానాధికారి ఆనంద్‌రెడ్డి, వ్యవసాయాధికారి సుజాత పాల్గొన్నారు.

ప్రశాంతంగా జెండా ఉత్సవం నిర్వహించాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరులో నిర్వహించే జెండా ఉత్సవం ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. పట్టణంలోని రోటరీ భవనంలో మంగళవారం నిర్వాహకులతో డీఎస్పీ రమణకుమార్‌తో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. పట్టణ, గ్రామీణ సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, కిషోర్‌బాబు, పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

శెభాష్.. గణేష్

విలువిద్యలో అంతర్జాతీయ స్థాయిలో రాణింపు



తైపీలో సాధించిన పతకాలతో గణేష్

నాయుడుపేట, న్యూస్‌టుడే: చేసే పనిలో చిత్తశుద్ధి, ఏకాగ్రత ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని నిరూపిస్తున్నాడు నాయుడుపేట భరత్‌నగర్‌కు చెందిన తిరుమూరు గణేష్ మణిరత్నం. బాల్యంలో అలవర్చుకున్న ఏకాగ్రతతో నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విలువిద్యలో సత్తాచాటుతున్నాడు. ప్రస్తుతం చెన్నైలో ఇంజినీరింగ్ చదువుతున్న గణేష్.. ఇటీవల చైనా దేశం తైపీలో జరిగిన ఆసియా విలువిద్య పోటీల్లో వ్యక్తిగత విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించాడు.

ఇవీ సాధించిన పతకాలు

పలు దేశాలు, రాష్ట్రాల్లో జరిగిన జాతీయ, అంతర్జాతీయ విలువిద్య పోటీల్లో ఇప్పటి వరకు 9 పసిడి, 4 రజత, 4 కాంస్య పతకాలు సాధించాడు. 2019లో జరిగిన 64వ అంతర జిల్లాల ఆర్చరీ క్రీడలు, జాతీయ పాఠశాలల క్రీడలు, 65వ ఎస్‌జీఎఫ్ అంతర జిల్లాలు ఆర్చరీ ఛాంపియన్, 2023లో జరిగిన 17వ సీనియర్ అంతర జిల్లాల ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీలు, హైదరబాద్, మహారాష్ట్ర, హరియాణా, మధ్యప్రదేశ్‌లో జరిగిన సీబీఎస్‌జీ జూనియర్, సీనియర్, వరల్డ్, యూత్ ఛాంపియన్ షిప్, ఆర్చరీ క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించాడు. గుజరాత్, గోవా, ఝార్ఖండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ ఆర్చరీ పోటీల్లో రజత, కాంస్య పతకాలు గెలుపొందాడు. ఈ ఏడాది జూన్‌లో ఐర్లాండ్ దేశంలో జరిగిన వరల్డ్ యూత్ ఆర్చరీలో రజతం సాధించాడు.

రెవెన్యూ శాఖలో బదిలీలు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: కొంతకాలంగా బాలాయపల్లి ఉప తహసీల్దారుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న శిరీషాను గూడూరు ఆర్డీవో కార్యాలయం నుంచి ఇక్కడకు రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులొచ్చాయి. ఆర్ఐ పూర్ణచంద్‌ను గూడూరుకు.. అక్కడ్నుంచి రూప శ్రీకాంత్‌ను ఇక్కడకు నియమించారు. సీనియర్ సహాయకులు మురహరి డక్కిలి ఆర్ఐగా, గూడూరు నుంచి చక్రీ బాలాయపల్లి సీనియర్ సహాయకులుగా నియమించారు. డిప్యూటీ సర్వేయర్ శరత్ సూళ్లూరుపేటకు, మన్నూరు వీఆర్వో జయశంకరరెడ్డి వెంకటగిరి మండలం కె.ఉప్పరపల్లికి బదిలీ అయ్యారు. అలిమిలి వీఆర్వో ఆదిశేషయ్యను గొట్టికాడుకు, కయ్యూరులోని మేకాలయ్యను కాట్రగుంటకు మార్పు చేశారు. డక్కిలి నుంచి మోహన్ ఊట్లపల్లికి, ఓజిలిలోని జానకిరామయ్య పిగిలాం వీఆర్వోలుగా నియమితులయ్యారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక చెన్నూరులో వాకింగ్ చేస్తున్న ఓ మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామీణ సీఐ కిషోర్‌బాబు కథనం మేరకు.. చెన్నూరుకు చెందిన ఉగ్గుమూడి నీరజ ఇంటికి సమీపంలో మహిళలతో కలిసి వాకింగ్ చేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని రూ.లక్షకు పైగా విలువ చేసే సుమారు 5 సవర్ల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. ఘటన స్థలానికి చేరిన గ్రామీణ సీఐ కిషోర్‌బాబు, ఎస్సై మనోజ్‌కుమార్ ఆరా తీశారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వెంకటగిరి, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న 9 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సుబ్బారావు తెలిపారు. నాయుడుపేట మార్గంలోని పంజాం గ్రామం నుంచి పట్టణంలోకి వస్తుండగా పట్టుకుని ఆర్టీసీ డిపోకు తరలించామన్నారు.